ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5 శ్రీ సత్యసాయి జిల్లా వార్తలు
ఆదివారం 16 మార్చి 2025

అంతా కొందరి గుప్పిట్లో..!

- ఎక్సైజ్‌శాఖపై ఖద్దరు పెత్తనం
- వ్యాపారులుగా మారిన నాయకులు
- సిండికేట్‌గా దుకాణాల నిర్వహణ
- ఇష్టారీతిన అమ్మకాలు, బెల్టు షాపులు
- ఎమ్మార్పీపై అదనంగా వసూలు
- చోద్యం చూస్తున్న అధికారులు


పుట్టపర్తి ప్రశాంతి గ్రామంలో మద్యం దుకాణం వద్ద అనధికార సిట్టింగ్ దుకాణాలు

పుట్టపర్తి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): జిల్లా ఎక్సైజ్‌శాఖపై ఖద్దరు పెత్తనం ఎక్కువ కావడంతో ఇష్టారాజ్యంగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. తీవ్ర ఒత్తిళ్ల నడుమ పని చేయలేయమంటూ ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారులు సంబంధిత శాఖ ఉన్నతాధికారులు, మంత్రికి సైతం మొరపెట్టుకున్నట్లు సమాచారం. జిల్లాలో మొత్తం (ప్రైవేట్ 87, కల్లుగీత కార్మికులకు తొమ్మిది) 96 మద్యం దుకాణాలు ఉన్నాయి. వీటి నిర్వాహకులు చాలా మంది సిండికేట్‌గా మారి మద్యం విక్రయాల్లో ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. అనధికార పర్మిట్ గదులు, గ్రామాల్లో బెల్టు షాపులతో యథేచ్ఛగా మద్యం విక్రయిస్తున్నారు.

మత్తు వ్యాపార అవతారమెత్తిన నేతలు

జిల్లా మద్యం వ్యాపారంలో రాజకీయ నాయకుల జోక్యం పెరిగింది. గతంలో వ్యాపారులే సిండికేట్‌గా మారి నిర్వహించేవారు. ఈదఫా అందుకు భిన్నంగా కొందరు నాయకులు మద్యం వ్యాపారుల అవతారం ఎత్తారు. లాటరీలో దుకాణం మాకు దక్కితే మేమే నిర్వహించుకుంటాం. మీకు దక్కినా మాకే ఇవ్వాలి మీ వాటా ఇస్తాం. కాదు..కూడదంటే వ్యాపారం ఎలా చేస్తారో మేం చూస్తాం. అంటూ తొలి నుంచే బెదిరింపులకు దిగారు. లాటరీలో దుకాణం దక్కిన వారికి, తమ మాట విననవి వారికి అద్దెకు భవనాలు దక్కకుండా, ప్రారంభించకుండా ఇబ్బంది పెట్టారు. సిండికేట్లో చేరకుంటే ఇబ్బందులు తప్పవు. నాలుగు సీసాలతో ఒక్కడు దొరికినా, ఎంఆర్‌పీ కంటే ఎక్కువకు అమ్మినా మీ దుకాణం మూతే అంటూ బెదిరించిన సంఘటనలు జిల్లాలో కోకొల్లలు. ఈనేపథ్యంలో మద్యం దుకాణాలు ఖద్దరు నాయకుల చేతుల్లోకి వెళ్లడంతో ఎక్సైజ్‌శాఖ అధికారులు మౌనంగా ఉండాల్సి వస్తోంది. హిందూపురం, ధర్మవరం, మడకశిర, కదిరి, పెనుకొండ, పుట్టపర్తి ఇలా జిల్లాలో అత్యధికంగా మద్యం దుకాణాలు నేతల కనుసన్నల్లోనే నడుస్తున్నాయి. ఇటీవల హిందూపురంలో నకిలీ మద్యం దొరికితే అందుకు బాధ్యులుగా హిందూపురం ఎక్సైజ్ సీఐపై బదిలీ వేటు వేశారు. నెలన్నర లోపే ఆ సీఐకు హిందూపురంలోనే పోస్టింగ్ ఇప్పించారు. ఈనేపథ్యంలోనే ఓ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్‌రు సెలవులో వెళ్లేలా పైస్థాయి నుంచి ఒత్తిళ్లు తీసుకువచ్చారు. ఇలా జిల్లాలో హిందూపురం నుంచి ధర్మవరం, కదిరి దాకా నాయకులు ఒక్కొక్కరు ఐదారు దుకాణాలను దక్కించుకుని, సిండికేట్‌గా మారి మద్యం విక్రయిస్తూ జేబులు నింపుకుంటున్నారు.



గ్రామాలకే సరుకు

జిల్లాలో మద్యం అమ్మకాలు పెంచుకునేందుకు ఊరూరా బెల్టు షాపులు ఏర్పాటు చేశారు. ఇందుకు ఆయా పరిధిలోని మద్యం దుకాణాల నిర్వాహకులు లక్షదాకా అడ్వాన్సులు వసూలు చేసినట్లు తెలిసింది. నాయకులు చెప్పిన వారికే బెల్టు షాపులు అప్పగించారు. మద్యం కోసం దుకానం వద్దకు రాకుండా నేరుగా బెల్టు షాపునకే మద్యం సరఫరా చేస్తామని ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో అనుమతులు లేకపోయినా గ్రామాల్లో పెద్దఎత్తున బెల్టు షాపులు ఏర్పాటు చేసి, ఎంఆర్‌పీ కంటే అధికంగా విక్రయిస్తున్నారు. అయితే ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ అధికారులు మాత్రం అప్పుడప్పుడు మొక్కు బడి తనిఖీలు చేస్తూ మమ అనిపిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

సమయపాలన ఏదీ..?

మద్యం దుకాణాలను రోజు ఉదయం 10 గంటల నుంచి రాత్రి పది గంటలదాకా మాత్రమే నిర్వహించాలి. అయితే ఇవి ఎక్కడా పాటించడం లేదు. కొన్ని చోట్ల ఉదయం ఎనిమిది, తొమ్మిది గంటలకే మొదలు పెట్టి రాత్రి 10 దాటిన సాగిస్తున్నారు. ఇక మద్యం దుకాణాల వద్ద సిట్టింగులకు అనుమతులు లేవు. కానీ దుకాణాల పక్కనే అనధికార పర్మిట్ గదులను ఏర్పాటు చేసుకుని మద్యం దుకాణాల వద్ద, డాబాల్లో సిట్టింగులతో మద్యం తాగిస్తున్నారు. ప్రతి మద్యం దుకాణాల వద్ద ఇవి చిన్నపాటి బార్లను తలపిస్తున్నాయి. నిబంధనల విషయంలో ఎక్సైజ్ శాఖ అధికారులు రహస్య ఒప్పందాలతో కేవలం పొరుగు రాష్ట్రం మద్యం పైనే దాడులు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

రూ.10 నుంచి రూ.30దాకా అదనం

ప్రస్తుతం చాలా దుకాణాల్లో మద్యాన్ని ఎంఆర్‌పీ కంటే ఎక్కువకు విక్రయిస్తున్నారు. 20శాతం కమీషన్ ఇస్తామని, ప్రభుత్వ పాలసీతో చాలా మంది మద్యం దుకాణాలు దక్కించుకున్నారు. తీరా అమ్మకాల దగ్గరకు వచ్చే సరికి నూటికి 12శాతం కమీషన్ కూడా దాటలేదని, ప్రతి నెలా నష్టాలు మూట గట్టుకుంటున్నట్లు నిర్వాహకులు గగ్గోలు పెడుతున్నారు. సరిహద్దు కావడంతో అక్రమంగా వచ్చే కర్ణాటక మద్యం ప్రభావం తీవ్రంగా ఉంది. మడకశిర నియోజకవర్గంలో నాలుగు దుకాణాలు మాకొద్దంటూ లైసెన్స్ ఫీజు కట్టేందుకు మొండికేయడం పరిస్థితికి అద్దం పడుతోంది. రాజకీయ నాయకులు మద్యం వ్యాపారంలోకి రావడంతో క్వార్టర్ బాటిల్‌పై రూ. 10 నుంచి రూ.30 దాకా పెంచి విక్రయిస్తున్నట్లు సమాచారం. వీటిపై అప్పుడప్పుడు ఎక్సైజ్‌శాఖ అధికారులు దాడులు చేస్తున్నా, సిండికేట్‌తోపాటు నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గాల్సి వస్తోంది. అందుకే కొందరు అధికారులు ఎలాగూ ఎవరిపైనా చర్యలు చేపట్టలేం. అమ్మకాలు పెంచుకోండి. మాకు ఇచ్చేది పెంచండి అంటూ డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల ప్రతి దుకాణం నెలకు ఇంత కట్టాల్సిందే అంటూ రెండుశాఖల నుంచి హుకుం జారీ అయినట్లు తెలిసింది.

ఉపేక్షించేదిలేదు

మద్యం దుకాణాల నిర్వహనలో సమయపాలన పాటించాల్సిందే. ఎంఆర్‌పీ కంటే ఎక్కువకు విక్రయిస్తే ఉపేక్షించేది లేదు. జిల్లా మద్యం దుకాణాల్లో అమ్మకాలపై నిరంతం నిఘా పెట్టాం. మద్యం దుకాణాల వద్ద అనధికార సిట్టింగులకు అనుమతిలేదు. ఎక్కడైనా నిర్వహిస్తున్నట్లు సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటాం. మాపై ఎవరి ఒత్తిళ్లలేవు. నిబంధనల మేరకు పర్యవేక్షణ చేపడుతున్నాం.

- గోవిందునాయక్, జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్


218 మంది గైర్హాజరు

కొత్తచెరువు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా శనివారం జరిగిన ద్వితీయసంవత్సరం ఇంటర్ పరీక్షలకు 218 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఐఈఓ రఘునాథరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జనరల్ కింద 9,057 మందికి గాను 8,877 మంది పరీక్షలు రాయగా 180 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. ఒకేషనల్‌కు చెందిన 785 మందికి గాను 747 మంది పరీక్షలు రాశారని 38 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. ఇంటర్ జనరల్ పరీక్షలు ముగిశాయని, ఒకేషనల్ పరీక్షలు ఈనెల 20 వతేదీ వరకు ఉంటాయని వివరించారు.



	ఇఫ్తార్	సెహరీ
పుట్టపర్తి	6.34 ఆదివారం సాయంత్రం	5.06 సోమవారం ఉదయం
కదిరి	6.30 ఆదివారం సాయంత్రం	5.08 సోమవారం ఉదయం
ధర్మవరం	6.33 ఆదివారం సాయంత్రం	5.05 సోమవారం ఉదయం
హిందూపురం	6.33 ఆదివారం సాయంత్రం	5.12 సోమవారం ఉదయం
పెనుకొండ	6.33 ఆదివారం సాయంత్రం	5.12 సోమవారం ఉదయం

ఉష్ణోగ్రతలు



గరిష్ఠం	38.0
కనిష్ఠం	22.0

ఆదిశేషుడిపై నారసింహుడు 7

అందరి సహకారంతో స్వచ్ఛాంధ్ర: మంత్రి సవిత


చీపురు పట్టి రోడ్లు ఊడ్చుతున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజల సహకారంతోనే గ్రామాల నుంచి పట్టణాల వరకు పరిశుభ్రత నెలకొంటుందని మంత్రి సవిత పేర్కొన్నారు. స్వచ్ఛాంధ్ర.. స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని శనివారం పెనుకొండలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. నగర పంచాయతీ కార్మికులు, ఎన్డీఏ కూటమి నాయకులు పలువురు ప్రజలతో కలిసి దర్గాసర్కిల్‌లో మానవహారంగా ఏర్పడి స్వచ్ఛభారత్‌పై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం చీపురుపట్టి రోడ్లు ఊడ్చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వైసీపీ పాలనలో చెత్తపై పన్నువేసి ప్రజలను ఇబ్బంది పెట్టడంతోపాటు చెత్త తరలించడంలో అశ్రద్ధ వహించారని విమర్శించారు. అదే ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెత్తపై పన్ను రద్దు చేయడంతో పాటు సంపద సృష్టిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కమిషనర్ సతీష్‌కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ రాఘవన్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, రమేష్‌బాబు, కన్వీనర్ శ్రీరాములు, నాయకులు చిన్నవెంకటరాముడు, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను నివారించాల్సిందే : కలెక్టర్

హిందూపురం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్‌ని పూర్తిగా నివారించకపోతే భవిష్యత్తు తరాలు ఇబ్బంది పడాల్సి వస్తుందని కలెక్టర్ చేతన్ పేర్కొన్నారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మున్సిపల్ కార్యాలయం నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు అందరూ సహకరించాలన్నారు. రాష్ట్రాన్ని స్వచ్ఛాంధ్రప్రదేశ్ గా మార్చడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఇళ్లతో పాటు మన చుట్టూ ఉన్న పరిసరాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాల పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్లాస్టిక్‌ని పూర్తిగా నివారించకపోతే భవిష్యత్తు తరాలు ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రమేష్, కమిషనర్ సంగం శ్రీనివాసులు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు అంజినప్ప, తహసీల్దార్ వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.


స్వచ్ఛాంధ్ర ప్రదేశ్‌పై ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్, ప్రజాప్రతినిధులు, అధికారులు

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- అరగంట ముందే కేంద్రాలకు చేరుకోవాలి : డీఈఓ కిష్టప్ప


మాట్లాడుతున్న డీఈఓ కిష్టప్ప

కొత్తచెరువు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని డీఈఓ కిష్టప్ప తెలిపారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 104 పరీక్షా కేంద్రాల్లో 28,730 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని పేర్కొన్నారు. ఈ నెల 17వతేదీ నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయని తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా పరీక్షా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తీ చేశామన్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా గాలి, వెలుతురు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసే విధంగా ఏర్పాట్లు చేశామని వివరించారు. జిల్లాలో ఆరు సమస్యాత్మక కేంద్రాలు ఉన్నాయని, వాటిలో సీసీ కెమరాలతో పాటు సిట్టింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటుచేశామని తెలిపారు. పరీక్షలు జరిగే సమయంలో జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని సమీప యజమానులకు నోటీసులు అందజేశామన్నారు. 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ఎవరైనా పరీక్షా కేంద్రాల వద్ద ఆటంకం కల్గిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా పరీక్షల విభాగపు అధికారి లాజర్, ఎంఈఓ జయచంద్ర పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో..


కలెక్టరేట్ ఆవరణలో శుభ్రం చేస్తున్న జేసీ, డీఆర్ఓ

పుట్టపర్తిటౌన్, మార్చి15 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పుట్టపర్తి కలెక్టరేట్ ఆవరణాన్ని జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, డీఆర్వో విజయసారథితో కలిసి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రజలు ప్లాస్టిక్ వస్తువులు, కవర్ల వినియోగం పూర్తిగా తగ్గించాలన్నారు. అనంతరం కలెక్టరేట్ సిబ్బందిచే స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు.

- పుట్టపర్తి ఆర్టీసీ బస్టాండ్‌లో శనివారం పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. దుకాణాల యజమానులకు తడి, పొడి చెత్త గురించి ఆర్ఎం మధుసూదన్ అవగాహన కల్పించారు. స్వచ్ఛాంధ్ర గురించి ప్రయాణికులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ఇనయతుల్లా, సిబ్బంది ఉన్నారు.

తాగి.. టైరుకింద ప్రయాణం..!


స్టెప్నీ టైరుపై ప్రయాణించిన గుర్తుతెలియని వ్యక్తి

పీకలదాకా మద్యం సేవించిన ఓ వ్యక్తి ఆర్టీసీ బస్సు స్టెప్నీ టైరు కింద దాక్కున్నాడు. ఉన్నదంతా మందుకే ఖర్చు పెట్టాడో ఏమో.. బస్సులో ఎక్కకుండా కింద దూరాడు. అది తెలియక డ్రైవర్ బస్సుతో బయలుదేరాడు. మార్గ మధ్యంలో ద్విచక్ర వాహనదారులు గుర్తించి, బస్సును నిలిపేయడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. పుట్టపర్తి డిపో ఆర్టీసీ బస్సు కొత్తచెరువు మీదుగా హిందూపురం వెళుతుండగా, శనివారం ఈ సంఘటన చోటు చేసుకుంది. దాదాపు 15 కి.మీ. స్టెప్నీ టైరు కింద దాక్కుని ప్రయాణించాడు ఈ మద్యం వీరుడు. పెనుకొండ మండలం కొండంపల్లి సమీపంలో టైరుపై నుంచి కాలు వేలాడుతుండటాన్ని ద్విచక్ర వాహనదారులు గమనించారు. ముందుకు వెళ్లి డ్రైవర్‌ను అప్రమత్తం చేశారు. దీంతో డ్రైవర్ చిరంజీవిరెడ్డి కంగారుగా బస్సును పక్కన ఆపేశారు. కండక్టర్ విజయలక్ష్మి, డ్రైవర్ దిగివచ్చి ఆ వ్యక్తిని బయటకు రప్పించారు. వివరాలు చెప్పకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. పెనుకొండ పోలీసులు ఆ వ్యక్తిని స్టేషన్‌కు తీసుకెళ్లారు.


- ఆంధ్రజ్యోతి, కొత్తచెరువు, పెనుకొండ రూరల్

సీమకు నీరివ్వడానికి కృషి: మంత్రి

హంద్రీనీవా లైనింగ్ పనులకు శంకుస్థాపన


పనులను ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్

ముదిగుబ్బ, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని మలకవేములక్రాస్ వద్ద హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులకు రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...ధర్మవరం నియోజకవర్గం సహా రాయలసీమ ప్రజలకు తాగు, సాగునీరు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గట్టిగా కృషిచేస్తోందన్నారు. రూ.936.7కోట్లతో హంద్రీనీవా మెయిన్ కెనాల్ లైనింగ్ పనులు చేపట్టామన్నారు. పట్నం వరకు 184 కిలోమీటర్ల మెయిన్ కెనాల్ లైనింగ్ పనులను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ పనులు పూర్తయిన తరువాత కాలువ ద్వారా నీటి సరఫరా మరింత మెరుగవుతుందన్నారు. పుంగనూరు బ్రాంచ్ కెనాల్ పట్నం నుంచి తనకల్లు మండలంలోని కొక్కంటిక్రాస్ వరకు 75 కిలోమీటర్ల లైనింగ్ పనులను రూ.319.6కోట్ల వ్యయంతో చేపడుతున్నామన్నారు. ఈ పనులను త్వరగా పూరిర్తీ చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ మహేశ్, ప్రాజెక్టు మేనేజర్ వెంకటరావు, బీజేపీ మండల అధ్యక్షుడు అంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రాణాంతక వ్యాధుల నుంచి అభయం

నేడు జాతీయ టీకా దినోత్సవం

టీకా.. జీవితకాలం రక్ష!

టీకా ప్రాణాంతక వ్యాధుల నుంచి కాపాడుతుంది. పుట్టిన బిడ్డకు, తల్లిపాల తరువాత ఎక్కువ రక్షణ ఇచ్చేది టీకా. అందుకే పిల్లలకు నిర్దిష్ట సమయంలో టీకాలు వేయిస్తుంటారు. అవి చిన్నారులకు క్షయ, కంఠసర్పి, కోరింత దగ్గు, ధనుర్వాతం, పోలియో, తట్టు, కామెర్లు, మెదడువాపు, నిమోనియా నుంచి రక్షణ కల్పిస్తుందని వైద్యులు సూచిస్తున్నారు. 1995 మార్చి 16న దేశంలో నోటి ద్వారా తీసుకునే టీకా మొదటి డోస్ ఇచ్చారు. అమెరికన్ వైరాలజిస్టు, వైద్య పరిశోధకుడు జోనస్ సాల్క తయారు చేసిన పోలియో టీకాలను చిన్నారులకు వేశారు. ఉద్యమంలా ఓరల్ పల్స్ పోలియో డ్రైవ్ నిర్వహిస్తున్నారు. అందుకు చిహ్నంగా ఏటా మార్చి 16న జాతీయ టీకా దినోత్సవం పాటిస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి, కదిరి అర్బన్

టీకా ప్రాముఖ్యత

● అప్పుడే పుట్టిన బిడ్డకు 15 రోజులలోపు '0' డోస్ ఓపీవీ టీకా ఇవ్వాలి.

డీసీజీ వ్యాక్సిన్

ట్యూబర్ క్యులోసిస్ (టీబీ) రాకుండా ఈటీకా వేస్తారు. జీవితంలో టీబీ ప్రతిఒకరికీ ఏదో ఒక దశలో వస్తుంది. అలా వచ్చినపుడు దాని తీవ్రతను తగ్గించేందుకు టీకా ఉపయోగపడుతుంది. చాలా మందికి టీబీ వచ్చిన, తగ్గిపోయిన విషయం కూడా తెలియదు.



హెపటైటిస్ బి

బిడ్డ పుట్టిన 24గంటల్లోపు 0.05 ఎం.ఎల్. తొడ వెలుపలి భాగంలోని కడరానికి ఇవ్వాలి.దీని ద్వారా చిన్నారులకు కామెర్లు, పెద్ద వయసులో వచ్చే లివర్ సంబంధిత క్యాన్సర్‌ను నివారించవచ్చు.

రోటావైరస్

6, 10, 14 వారాల్లో నోటి ద్వారా ఐదు చుక్కలివ్వాలి. రోటావైరస్ వల్ల కలిగే విరేచనాల నుంచి ఈ టీకా రక్షణ కల్పిస్తుంది. ఆస్పత్రిలో చేరి సెలైన్ ఎక్కించుకోవాల్సిన అవసరాన్ని, పోషకాహార లోపాన్ని తగ్గిస్తుంది.



పెంటావాలెంట్ టీకా

ఈటీకా అత్యంత ప్రధానమైనది. ఐదు ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తుంది. బిడ్డ పుట్టిన 6, 10, 14 వారాల్లో 0.05 ఎం.ఎల్. ఎడమ తొడ వెలుపలి భాగంలో కండరంలోకి ఇస్తారు. కంఠసర్పి, కోరింత దగ్గు, శిశుపక్షపాతం, కామెర్లు, నిమోనియా, మెదడువాపు, చెవిటితనం రాకుండా నివారిస్తుంది. ఏడాదిలోపు చిన్నారులకు మాత్రమే ఈ టీకా ఇవ్వాలి.

ఎంఆర్ టీకా

9 నెలలు నిండిన చిన్నారులకు ఎంఆర్ టీకా 0.05 ఎం.ఎల్. కుడి భుజాన చర్మం కింద ఉన్న కొవ్వు పొరల్లోకి ఇవ్వాల్సి ఉంటుంది. ఈ టీకాతో పిల్లలను తట్టు నుంచి కాపాడవచ్చు.

విటమిన్ ఎ ద్రావణం

దీనిని 1, 2, 5 సంవత్సరాల వరకు ఆరు నెలలకోసారి మొత్తం 9 డోస్‌ల వరకు 2 ఎం.ఎల్. నోటి ద్వారా ఇవ్వాలి. తద్వారా చిన్నవయసులో వచ్చే శ్వాసకోశ, జీర్ణకోశ, కంటి, చర్మవ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చు.

బూస్టర్ డోస్

16 నుంచి 24 నెలలలోపు ఓపీవీ, డీపీటీ-1, ఎంఆర్-2, జేఈ-2, విటమిన్ ఎ ద్రావణం ఇవ్వాలి. ఐటీవీ టీకా పోలియాను నిరోధిస్తుంది. పోలియో వ్యాక్సినేషన్ మూడు డోసులిస్తారు. మొదటి డోసు రెండు మాసాలకు, రెండు, మూడు డోసులు 9నుంచి 15 నెలల వ్యవధిలో ఇస్తారు.

వరిసెల్లా వ్యాక్సిన్

చికెన్ ఫాక్స్‌ను నిరోధించడానికి ఈ వ్యాక్సిన్ ఉపయోపడుతుంది. ఏ వయసు వారైనా తీసుకోవచ్చు. పిల్లలు రెండు డోసులు తీసుకోవాలి. 15 నెలలకు ఒకటి, 18 నుంచి 21 నెలల మధ్య మరో డోసు తీసుకోవాలి. ఐదు డోసులు టీడీఏపీ టీకా వేస్తారు. మొదటి డోసు రెండు నెలలకు, రెండోది నాలుగు నెలలకు ఇస్తారు. తరువాత ఆరు నెలల వయసులో ఒకటి, 15 నుంచి 18 నెలల మధ్యలో మరొకటి, 4 నుంచి 6 ఏళ్ల వయసులో మరో డోసు ఇస్తారు.

క్యాచ్ అఫ్ వ్యాక్సినేషన్

నేషనల్ ఇమ్యునైజేషన్ షెడ్యూల్ ప్రకారం ఒక్కో టీకాను ఒక్కో నిర్దిష్ట సమయంలో వేయించుకోవాల్సి ఉంటుంది. అలా టీకాలను సమయానికి వేయించుకోకపోతే వారికోసం క్యాచ్ అఫ్ వ్యాక్సినేషన్ ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. వ్యాక్సినేషన్ సమయానికి తీసుకోనివారి కోసం వారు ఆపేసిన దగ్గరనుంచి వ్యాక్సిన్ తీసుకునేలా షెడ్యుల్ ఇవ్వడమే క్యాచ్ ఆఫ్ వ్యాక్సినేషన్. ముందుగా వైద్యులను సంప్రందించి, వారి సూచన మేరకు వ్యాక్సిన్ తీసుకోవాల్సి ఉంటుంది.

పెద్దయ్యాక తీసుకోవచ్చా?

కొంతమంది చిన్నతనంలో టీకాలు తీసుకోకుండా ఉంటారు. ఆ టీకాలను పెద్దయ్యాక తీసుకోవచ్చా అనే అనుమానం కూడా చాలామందికి ఉంటుంది. చిన్నతనంలో వేయించుకోని టీకాలను పెద్ద వయసులో అసవరం లేదని వైద్యులు అంటున్నారు. రెండేళ్ల వయసులో చికెన్‌ఫాక్స్ వ్యాక్సీన్ తీసుకోని వారికి 12 ఏళ్ల వరకు క్యాచ్ ఆఫ్ వ్యాక్సీన్ వేస్తారు. ఆ చిన్నారికి నాలుగో ఏటే చికెన్ ఫాక్స్ వచ్చి తగ్గిపోయి ఉంటే, వ్యాక్సీన్ అవసరం లేదు.

ఎవరు వేసుకోకూడదు?

కొన్ని సందర్భాల్లో కొంతమంది కొన్నిరకాల టీకాలను వేసుకోకూడదని వైద్యులు సూచిస్తున్నారు. జ్వరం, దగ్గు, జలుబు ఉన్నపుడు టీకాలు వేయించరాదు. తగ్గిన తరువాత వేయించాలి. ఒకేరోజు ఎన్ని టీకాలైనా పిల్లలకు ఇవ్వచ్చు. మళ్లీ నాలుగు వారాల వరకు ఇవ్వకూడదు. పల్స్ పోలియో కార్యక్రమం, రేబీస్ టీకాలకు ఈ షరతు వర్తించదు. వరిసెల్లా, ఎంఆర్ వంటి టీకాలను రోగనిరోధక శక్తి తక్కువగా ఉండే గర్భవతులు, హెచ్ఐవీ పీడితులు తీసుకోకూడదు.

వ్యాధి నిరోధిక శక్తి పెరుగుతుంది

వ్యాధుల నుంచి టీకాలు రక్షణ కల్పిస్తాయి. వ్యాధి నిరోధిక శక్తి పెంచుతాయి. పుట్టిన బిడ్డకు వైద్యుల సలహాతో టీకాలు వేయించాలి. ఈవిషయంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. టీకాల ద్వారా లభించే రోగనిరోధిక శక్తి ఏళ్ల తరబడి రక్షణగా ఉంటుంది. నిర్ధిష్ట వ్యాధులను నియంత్రించడం, నిర్మూలించడంలో టీకాలు ఎంతో ఉపయోగపడతాయి.



- శ్రీనివాసరెడ్డి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి



జైనపీఠం.. పెనుకొండ

పాదబెట్టపై మునుల అంత్యక్రియలు


బండలపై పాదాలు చెక్కించడం ఆనవాయితీ



పెనుకొండ పట్టణంలోని పాదబెట్ట

పెనుకొండ, మార్చి 15(ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రసిద్ధి చెందిన నాలుగు జైన పీఠాల్లో పెనుకొండ ఒకటిగా భాసిల్లింది. పెనుకొండ అంటే విజయనగర రాజులు పాలించిన ప్రాంతంగానే అందరికి తెలుసు. కానీ పెనుకొండ ఓ ప్రసిద్ధ జైన పీఠమని బయటి వారికే కాక చాలామంది స్థానికులకు కూడా తెలియదు. పెనుకొండ గ్రామంలో 11వ శతాబ్దంలో అనేక జైన కుటుంబాలు నివాసముండేవని చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. జైన మతానికి చెందిన తొమ్మిది మంది తీర్థంకరులకు సంబంధించిన దేవాలయాలు ఉండేవి. ప్రస్తుతం పచ్చా పార్శ్వనాథ దేవాలయం, అజితనాథ దేవాలయం మాత్రమే ఉన్నాయి. ఈ ఆలయాల్లో నేటికీ పూజలు కొనసాగుతున్నాయి. వీటితోపాటు 16వ తీర్థంకరుడైన శాంతినాథ దేవాలయం కూడా ఉండేది. ఆయన విద్యాపీఠాన్ని స్థాపించినట్లు 12వ శతాబ్దంలో భాస్కర్‌కవి రచించిన జీవంధార చరిత్ర గ్రంథంలో పొందుపరిచారు. ప్రస్తుతం పెనుకొండలో రెండు జైన కుటుంబాలు మాత్రమే నివసిస్తున్నాయి.

జైనమునుల క్షేత్రం



కొండపైన రాతి గుహ

ప్రసిద్ధ జైన క్షేత్రమైన పెనుకొండకు ఆకాలంలో అనేక మంది జైన మనులు వచ్చేవారు. వారు ఇక్కడే స్థిరనివాసం ఏర్పరుచుకుని, ధాన్యంలో నిమగ్నమైనట్లు ఆధారాలు చెబుతున్నాయి. ఈ దిగంబర జైన మునులు చనిపోతే వైజంక్షన్ సమీపంలోని జాతీయ రహదారి పక్కన ఉన్న పాదబెట్ట అని పిలువబడే కొండపై అంత్యక్రియలు నిర్వహించేవారు. అక్కడే చనిపోయిన వారి స్మారకంగా వారి పాదాలను గుట్ట బండలపై చెక్కించడం ఆనవాయితీ. దీనికారణంగానే ఈ కొండకు పాదబెట్ట అనే పేరు వచ్చినట్లు చరిత్రకారులు చెబుతున్నారు. 1966లో అజితకీర్తి మహరాజ్ దిగంబర ముని చనిపోగా ఈ కొండపైనే ఆయనకు అంత్యక్రియలు నిర్వహించి పాదాలను చెక్కించారు. ఈయనతోపాటు చంద్ర సాగర వరుణి ఐలక్ ముని పాదాల గుర్తును చెక్కించారు. దీని సమీపంలోని గుట్టపై 10వ తీర్థంకరుడు శీతలనాథ విగ్రహం, పంచ పరమేశ్వరుడి విగ్రహాలు, యక్షిణి విగ్రహాలు దానిపక్కనే పార్శ్వనాథస్వామి పద్మాసనం భంగిమలో చెక్కబడిన విగ్రహాలను బండలపై చెక్కారు.



గుహలో చెక్కిన జైన మునుల చిత్రాలు

నేడు వార్షిక పూజలు



పచ్చా పార్శ్వనాథస్వామి ఆలయంలో ఈనెల 16న వార్షిక మహోత్సవ పూజలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు అజిత ప్రసాద్ జైన్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జైన స్వామిలు శాంతిశ్రీ స్వామిజీ, భువనకీర్తి భట్టారక, భట్టాచార్య, చంద్రకీర్తి, హారతి, రాజేంద్రప్రసాద్, శ్రీయ జైన్, రాజన్ తదితరులు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు.

పెద్దపేటలో చోరీ

యాడికి, మార్చి15(ఆంధ్రజ్యోతి): వేసిన తాళాలు వేసినట్లే ఉన్నప్పటికి ఇంటిలో ఉన్న 15తులాల బంగారు నగలు, రూ.20వేలు చోరీ అయిన సంఘటన పెద్దపేట గ్రామంలో శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన మేరకు పెద్దపేట గ్రామానికి చెందిన సంజీవరాయుడు ఇంటిలోని బీరువాలో ఉన్న బంగారునగలు, నగదు ఎప్పుడు మాయమయ్యాయో తెలియదు. శుక్రవారం సాయంత్రం బీరువా తెరిచి చూడగా అందులో ఉన్న 15తులాల బంగారునగలు, రూ.20వేలు నగదు కనిపించకుండా పోయినట్లు తెలిపారు. బాధితుడు ఫిర్యాదు చేయడానికి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాడని తెలిపారు. ఆరాతీసిన పోలీసులు ఇంటిలోని బీరువాకు వేసిన తాళాలు వేసినట్లే ఉన్నప్పుడు బంగారం, నగదు ఎవరు ఎత్తుకువెళతారని మందలించి పంపినట్లు తెలిపారు.

ఇంటర్ విద్యార్థిని అదృశ్యం

బొమ్మనహాళ్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థిని అదృశ్యమైనట్లు ఎస్ఐ నబీరసూల్ తెలిపారు. బొమ్మనహాళ్‌కు శనివారం ఉదయం చివరి రోజు పరీక్షలు రాసేందుకు వచ్చి సాయంత్రమైనా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులను ఆశ్రయించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తిపై దాడి

పుట్లూరు, మార్చి15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గరుగుచింతలపల్లి గ్రామంలో నాగరాజు అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన నవీన్‌తోపాటు మరో ముగ్గురు కలిసి దాడి చేసినట్లు ఎస్ఐ వెంకటనరసింహం తెలిపారు. వడ్డెర కాలనీలో ఇంటివద్ద సందులో నాగరాజు కట్టెల మోపు తీసుకు వస్తుండగా ఇరువురు మాటామాటా అనుకున్నారు. ఈక్రమంలోనే నవీన్ మరో ముగ్గురు కలిసి కట్టెలతో దాడి చేశారన్నారు. నాగరాజుకు గాయాలు కావడంతో తాడిపత్రి ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మొక్కజొన్న పంట దగ్ధం

గుమ్మఘట్ట, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని మారెంపల్లి గ్రామ సమీపంలో రైతు గోనబావి కృష్ణయ్యకు చెందిన మూడెకరాల మొక్కజొన్న పంట శనివారం మధ్యాహ్నం పూర్తిగా దగ్ధమైంది. రైతు కృష్ణయ్య పొలం సమీపంలో మరో రైతు పొలం గట్టుమీద ఎండిన గడ్డికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో ఆ మంటలు వ్యాపించి మొక్కజొన్న పంట మొత్తం పూర్తిగా దగ్ధమైంది.

రోడ్డు ప్రమాదంలో అంగన్‌వాడీ ఆయా మృతి

కళ్యాణదుర్గంరూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ పరిధిలోని గూబనపల్లి మలుపు వద్ద శనివారం ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తాపడటంతో అంగన్‌వాడీ ఆయా లక్ష్మీదేవి(40) దుర్మరణం చెందారు. పోలీసులు తెలిపిన మేరకు బెళుగుప్ప మండలం నరసాపురం గ్రామానికి చెందిన లక్ష్మీదేవి, తన భర్త వన్నూరుస్వామితో కలిసి ద్విచక్ర వాహ నంపై కళ్యాణదుర్గం బయల్దేరారు. గూబనపల్లి మలుపు వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న పిల్లర్‌ను ఢీకొంది. దీంతో లక్ష్మీదేవి అక్కడికక్కడే మృతి చెందారు. గాయపడిన వన్నూరు స్వామిని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతురాలికి సంతానం లేదు.

విద్యుదాఘాతంతో వ్యక్తి ..

పుట్లూరు, మార్చి15(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాయకునిపల్లి గ్రామానికి చెందిన రామమునిరెడ్డి (40) శనివారం విద్యుదాఘాతంతో మృతి చెందాడని ఎస్ఐ వెంకటనరసింహం తెలిపారు. రామమునిరెడ్డి పుట్లూరు పరిసర ప్రాంతాల్లో ప్రైవేట్ లైన్‌మన్‌గా పని చేసేవాడు. ఇందులో భాగంగా శనివారం ఉదయం ఓబులేసు తోట వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లోని ప్రధాన ఫ్యూజును మార్చడానికి ప్రయత్నిస్తుండగా విద్యుత్‌షాక్ తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య వెంకటలక్షుమ్మ, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ఇద్దరు నిందితులకు రిమాండ్

గుంతకల్లు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఓ కేసులో కోర్టుకు హాజరు కాకుండా తప్పించుకు తిరుగుతున్న ఇద్దరు నిందితులను జేఎఫ్ సీఎం కోర్టు ఐదురోజుల రిమాండు విధించిందని కసాపురం ఎస్సై టీపీ వెంకటస్వామి ఓ ప్రకటనలో తెలిపారు. దొంగతనం కేసులో నిందితులు కొంగనపల్లికి చెందిన ఈ పులిశేఖర్, ఈ ఆనంద్ కోర్టు వాయిదాలకు హాజరుకాకపోవడంతో వారిపై నాన్‌బెయిలబుల్ వారెంట్లు జారీ అయ్యా యన్నారు.

రైతుల ఆర్థిక స్థితిని మారుస్తాం : విప్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

డి.హీరేహాళ్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని రైతుల ఆర్థిక స్థితిగతులను మార్చాలన్నది ప్రభుత్వ ఉద్దేశ్యమని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం మండలంలోని కాదలూరు గ్రామంలో వివిధ సోలార్ ఎనర్జీ పారిశ్రామిక ప్రతినిధులతో కలిసి రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లపాటు రాష్ట్రంలో నియంత పాలన సాగించి రైతులను నట్టేట ముంచిందని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ఏవైనా ప్రైవేట్ కంపెనీలు ఇక్కడికి రావడానికి సిద్ధంగా ఉన్న సమయంలో జగన్‌రెడ్డి జే టాక్స్ కట్టలేక వెనుదిరిగి వెళ్లిపోయేవని, గతంలో స్థాపించిన పరిశ్రమలు కూడా రాష్ట్రం విడిచి వెళ్లిపోయాయని తెలిపారు. దీంతో రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలోకి కూరుకుపోయిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తారన్న నమ్మకంతో నేడు అనేక పరిశ్రమలు తిరిగి రాష్ట్రానికి వస్తున్నాయని అన్నారు. అందులో భాగంగానే ప్రస్తుతం రాయదుర్గం నియోజకవర్గంలో సోలార్ ఎనర్జీ పరిశ్రమలు ముందుకు వచ్చాయని వివరించారు. ఎకరానికి సంవత్సరానికి రూ. 31 వేలు లీజు సొమ్ము ఇస్తారని, భూమి సర్వహక్కులు రైతులకే ఉంటాయని అన్నారు. తద్వారా రైతుల ఆర్థిక స్థితిగతులు మారడమే కాకుండా గ్రామాల్లో యువతకు ఉపాధి చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మునివేలు, టీడీపీ నాయకులు హనుమంతరెడ్డి, మోహన్‌రెడ్డి, నాగళ్లి రాజు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి విశేష పూజలు



బొమ్మనహాళ్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లులో వెలసిన ఆంజనేస్వామికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్ చార్యులు, సంతోష్‌కుమార్ చార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి మూలవిరాట్‌కు విశేష పుష్పాలంకరణ చేసి నైవేద్యం సమర్పించిన అనంతరం మహా మంగళహారతి ఇచ్చారు. వందలాది మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఆలయ సన్నిధిలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. దేవదాయశాఖ అధికారి ఓబన్న తదితరులు పాల్గొన్నారు.

కూలిన వంతెన



బిదురకుంతం వద్ద కూలిన వంతెన

కణేకల్లు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని బిదురకుంతం - వ్యాసాపురం గ్రామాల మధ్య ఉన్న వంతెన శనివారం సాయంత్రం అకస్మాత్తుగా కూలిపోయింది. ఉరవకొండ నియోజకవర్గం వ్యాసాపురం గ్రామానికి కణేకల్లు మండలం బిదురకుంతం గ్రామానికి రాకపోకలతో పాటు వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు మార్గంగా ఉన్న వంతెన కూలడంతో రాకపోకలు స్తంభించిపోయాయి. అధికారులు వెంటనే మరమ్మతులు ఇబ్బంది కలుగకుండా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బాలికలను మింగిన కుంట

● నీరు తాగేందుకు వెళ్లి ఇద్దరి మృతి



మృతిచెందిన బాలికలు లక్ష్మి, అరుణ వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

గార్లదిన్నె, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొండకింద కల్లూరు వద్ద నీటి కుంటలో మునిగి లక్ష్మి (15), అరుణ (10) అనే ఇద్దరు బాలికలు మృతి చెందారు. కొండ కింద కొట్టాల సమీపంలోని ఆవులోళ్ల చిన్న చిన్న గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారు. ఈ కుటుంబాలకు చెందిన ఎనిమిది మంది చిన్నారులు కట్టెల కోసం సమీపంలోని పెన్నానదిలోకి వెళ్లారు. ఎండు పుల్లలు ఏరుకున్న తరువాత ఎండ తీవ్రతకు దాహం వేయడంతో లక్ష్మి, అరుణ నీటి కుంట వద్దకు వెళ్లారు. ఎంతసేపటికీ తిరిగిరాకపోవడంతో మిగిలిన బాలికలు అక్కడికి వెళ్లి చూశారు. అప్పటికే ఇద్దరూ నీటిలో మునిగిపోయినట్లు గుర్తించి, కేకలు వేశారు. సమీపంలో ఉన్న గొర్రెల కాపరులు వెళ్లి బాలికలను బయటకు తీశారు. అప్పటికే ఇద్దరూ మృతిచెందారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి వెళ్లి కన్నీరుమున్నీరుగా విలపించారు. శింగనమల సీఐ కౌలుట్లయ్య, హెడ్ కానిస్టేబుల్ ఫిరోజ్‌బాషా సంఘటన స్థలానికి చేరుకుని విచారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కొట్టాలలో ఉంటున్న అర్జునప్ప, గంగమ్మ దంపతులకు ముగ్గురు కూతుళ్లు, ఇద్దరు కుమారులు కాగా.. లక్ష్మి చివరి సంతానం. గోపాల్, రామక్క దంపతులకు ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు కాగా, అరుణ ఆఖరు సంతానం.

పరీక్ష కేంద్రం మార్పులో మతలబేమిటో..?

యల్లనూరు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్నో ఏళ్లుగా నిర్వహిస్తూ వస్తున్న పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని ఈ ఏడాది మాత్రం చిలమకూరు పరీక్షా కేంద్రానికి మార్చడం వెనుక ఉన్న మతలబేమిటని మండల వాసులు ప్రశ్నిస్తున్నారు. మండల కేంద్రానికి 12కిలో మీటర్ల దూరంలో ఉన్న చిలమకూరు ఆదర్శ పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రానికి యల్లనూరు నుంచి 52 మంది విద్యార్థులు, వెన్నపూసపల్లి నుంచి 17 మంది, కేజీబీవీ నుంచి 36 మంది, శారదా విద్యానికేతన్ నుంచి 30 మంది విద్యార్థులు వెళ్లి పరీక్ష రాయనున్నారు. సాధారణంగా గ్రామాల్లో ఏమైనా ఇబ్బందులు ఉంటే మండల కేంద్రానికి మార్పు చేయడం పరిపాటి. కానీ ఇక్కడ మాత్రం మండల కేంద్రంలోని సెంటర్‌కు అన్ని సౌకర్యాలు ఉన్నప్పటికి మార్పు చేయడం వెనుక ఏమైనా మతలబు ఉందా అంటూ విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 40ఏళ్ల నుంచి మండల కేంద్రంలోనే పరీక్ష కేంద్రం ఉంటోంది. ఈ ఏడాది మాత్రం చిలమకూరు మార్చడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. విద్యార్థులు అక్కడికి వెళ్లడానికి ఎలాంటి రవాణా సౌకర్యాలు లేవు. కనీసం బస్సుసౌకర్యం కూడా లేదు. ఈ విషయంపై ఎంఈఓ చంద్రశేఖర్‌ను వివరణ కోరగా.. ముందుగా పరీక్ష కేంద్రం మార్పుపై సమాచారం లేదని, తెలిసిన వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లానని తెలిపారు.ఈ ఏడాది పరీక్ష కేంద్రం చిలమకూరులోనే కొనసాగిస్తామని తెలిపారు. వచ్చే ఏడాది యల్లనూరులోనే కొనసాగిస్తామని వివరించారు.

యువకుడి ఆత్మహత్య

కళ్యాణదుర్గం రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన సంఘటన పట్టణంలోని మోడల్ స్కూలు సమీపంలో శనివారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు ఎర్రనేల వీధికి చెందిన మోహన్ (18)శుక్రవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. శనివారం రాత్రి పట్టణ శివారులోని మోడల్ స్కూలు దగ్గర ఓ చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. అటుగా వెళ్లిన ప్రజలు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి తండ్రి పాపన్న, తల్లి పద్మ, ముగ్గురు అక్కలు ఉన్నారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్టు

తాడిపత్రి, మార్చి15(ఆంధ్రజ్యోతి): మండలంలోని చుక్కలూరు రోడ్డులో రెండు రోజుల క్రితం వెంకటేశ్వరమ్మ ఇంటిలో జరిగిన చోరీ కేసుకు సంబంధించి నాగేంద్ర అలియాస్ కొక్కి, సుబ్బరాయుడులను శనివారం అరెస్ట్ చేసినట్లు రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. వారి నుంచి ద్విచక్రవాహనం, రూ.3800 స్వాధీనం చేసుకున్నామన్నారు. రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ మాట్లాడుతూ చుక్కలూరురోడ్డులో ఒక నల్లబండల ఫ్యాక్టరీని కళాచారి, వెంకటేశ్వరమ్మ దంపతులు లీజుకు తీసుకొని నిర్వహిస్తున్నారు. రెండురోజుల కిందట ఇగుడూరు గ్రామానికి చెందిన నాగేంద్ర, సుబ్బరాయుడులు ద్విచక్రవాహనంలో ఫ్యాక్టరీ వద్దకు వెళ్లారు. నాగేంద్ర ఇంటిలోకి చొరబడి వెంకటేశ్వరమ్మను బెదిరించి రూ.పది వేలు నగదును ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. అందిన సమాచారం మేరకు శనివారం చుక్కలూరు క్రాస్ వద్ద ఇరువురు నిందితులను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

చెట్టుపై నుంచి పడి కూలీ మృత్యువాత

కుందుర్పి, మార్చి 15(ఆంధ్రజ్యోతి) : మండలంలోని శ్రీమజ్జనపల్లి గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ కెంచయ్య (42) శనివారం చింత చెట్టుపై నుంచి కిందపడి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడు కెంచయ్య కూలి పనిలో భాగంగా శనివారం ఉదయం చింతకాయలు కోయడానికి కర్ణాటక ప్రాంతమైన పుత్రాళ్ల పల్లి వద్దకు వెళ్లాడన్నారు. చింతకాయలు కోసే క్రమంలో కాలుజారి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన ఆయన్ను కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య నేత్ర, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

విడపనకల్లు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆదర్శ పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చేరే విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ గంగాధరగౌడ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి ఆదర్శ పాఠశాలలో చేరే విద్యార్థులు ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. 10వ తరగతి పాసైన విద్యార్థులు అర్హులు అన్నారు. ఓసీ, బీసీ, విద్యార్థులు రూ. 200, ఎస్సీ ఎస్టీ విద్యార్థులు రూ. 150 దరఖాస్తు ఫీజు చెల్లించి ఈ నెల 17 నుంచి మే 22వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

పది విద్యార్థులకు ఉచిత ప్రయాణం

ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సుమంత్



అనంతపురం కల్చరల్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఈ నెల 17వ తేదీ నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించనున్నట్లు సంస్థ రీజనల్ మేనేజర్ సుమంత్ ఆర్. ఆదోని తెలిపారు. ఈ మేరకు శనివారం తన చాంబర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు తమ ప్రాంతం నుంచి పరీక్షాకేంద్రం వరకు, పరీక్ష ముగిశాక తిరిగి తమ ప్రాంతం వరకు పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేయవచ్చు అన్నారు. స్టూడెంట్ బస్‌పాస్ లేని పదోతరగతి విద్యార్థులు సైతం ఒరిజినల్ హాల్‌టికెట్‌ను కండక్టర్‌కు చూపి రీజియన్‌లోని అన్ని డిపోల పరిధిలోనూ ఉచితంగా ప్రయాణించవచ్చునని తెలిపారు. సోమవారం నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు మాత్రమే ఈ అవకాశం కల్పించామని, పదోతరగతి విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



ఆదిశేషుడిపై దేవేరుల సమేతుడైన నారసింహుడు

ఆదిశేషుడిపై నారసింహుడు

దేవేరుల సమేతంగా శ్రీవారి దర్శనం

కదిరి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాల్లో భాగంగా కదిరి నరసింహ స్వామి శనివారం శ్రీదేవి, భూదేవిల సమేతంగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నిత్యపూజ, హోమం అనంతరం యాగశాల నుంచి బయలుదేరిన శ్రీవారు తిరువీధుల్లో విహరించారు. సంధ్యాసమయంలో దేవేరుల సమేతుడై ఆదిశేషుడిపై దర్శనమిచ్చారు. పక్షం రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాల్లో అన్ని ఉత్సవాల్లోనూ నారసింహుడు మాత్రమే దర్శనమిస్తారు. ఒక్క శేషవాహనంపై మాత్రమే అమ్మవార్ల సమేతుడిగా మాడవీధుల్లో విహరిస్తారు. ఈఉత్సవానికి తనకల్లు మండలంలోని కొక్కంటి జ్యోతి రావడం ఆనవాయితీ. ఈ ఉత్సవంలో ఆలయ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, పాల్గొన్నారు.

నేడు సూర్య, చంద్ర ప్రభ వాహనం

ఆదివారం స్వామివారు సూర్య, చంద్రప్రభ వాహనాలపై భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఉద యం వేళ సూర్యప్రభ, రాత్రి సమయంలో చంద్ర ప్రభ వాహనాలపై తిరువీధుల్లోభక్తులకు దర్శనమిస్తారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి15(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకులాల్లో 5,6,7,8,9 తరగతుల్లో ప్రవేశాల దరఖాస్తు గడువు పొడిగించినట్లు ఆ గురుకులాల జిల్లా కన్వీనర్ జోనతన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇది వరకూ ఈ నెల 15వ తేదీ చివరి గడువుగా ఉండేదని, దాన్ని ఈ నెల 25 వరకూ పొడిగిస్తున్నామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు జిల్లాలోని గురుకుల పాఠశాలల్లో https://mjpapbcwreis.apcfss.in వెబ్‌సైట్‌ను సందర్శించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 20న జరిగాల్సిన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర ప్రవేశ పరీక్షను మే ఐదో తేదీకి మార్చినట్లు తెలిపారు.

ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన బీ ఫార్మసీ, ఫార్మా-డీ, ఎంఫార్మసీ, ఎంటెక్ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ప్రొఫెసర్ నాగప్రసాద్ నాయుడు తెలిపారు. బీఫార్మసీ ద్వితీయ సంవత్సరం ప్రథమ సెమిస్టర్(25) రెగ్యులర్‌తో పాటు ప్రథమ, ద్వితీయ సెమిస్టర్ (ఆర్15,19) సప్లిమెంటరీ ఫలితాలు విడదల చేశామన్నారు. ఫార్మాడీ ద్వితీయ, తృతీయ, నాలుగో సంవత్సరం(ఆర్17) అడ్వాన్స్, ద్వితీయ సంవత్సరం(ఆర్14), ప్రథమ సంవత్సరం (ఆర్14,17) సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు తెలిపారు. ఎంఫార్మసీ ద్వితీయ, నాలుగో సెమిస్టర్(ఆర్21) సప్లిమెంటరీ, ప్రథమ సెమిస్టర్(ఆర్21) రెగ్యులర్, సప్లిమెంటరీతో పాటు ఎంటెక్ నాలుగో సెమిస్టర్(ఆర్21) సప్లిమెంటరీ ఫలితాలు విడుదల చేశామని ఆయన తెలిపారు.

కదిరికి చేరిన కొక్కంటి జ్యోతి



కొక్కంటిలో బయల్దేరిన జ్యోతి

తనకల్లు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కదిరి లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు తనకల్లు మండలంలోని కొక్కంటి పాలేగాళ్ల జ్యోతి రావడం ఆనవాయితీ. ఆ మేరకు శుక్రవారం రాత్రి కొక్కంటిలో పూజలు నిర్వహించారు. పాలేగాళ్ల వైవీ దినకర్‌ప్రసాద్‌నాయుడు నివాసంలో ప్రత్యేక పూజల అనంతరం ఊరేగింపు నిర్వహించారు. అనంతరం కాలినడక జ్యోతి నల్లచెరువు మండలంలోని పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి ఆలయం మీదుగా శనివారం కదిరి చేరుకుంది. అక్కడ కొక్కంటి జ్యోతికి ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. ఆలయంలో విడిది కేటాయించారు. ఉత్సవాల్లో కొక్కంటి జ్యోతి ముందుండడం ఆనవాయితీగా కొనసాగుతున్నట్లు కొక్కంటి పాగేళ్ల తెలిపారు.

పరిశ్రమల శాఖ జీఎం బదిలీ

కొత్త జీఎంగా శ్రీనివాస్ యాదవ్

అనంతపురం అర్బన్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): పరిశ్రమల శాఖ జీఎం శ్రీధర్ శ్రీకాకుళం జిల్లాకు బదిలీ అయ్యారు. గత ఏడాది అక్టోబరులో అనకాపల్లి నుంచి ఆయన జిల్లాకు బదిలీపై వచ్చారు. అప్పటి నుంచి తిరిగి వెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఆయన బదిలీ నేపథ్యంలో చిత్తూరు పరిశ్రమ శాఖ జీఎంగా పనిచేస్తున్న శ్రీనివాస్ యాదవ్‌ను జిల్లాకు నియమించారు. రెండు రోజుల్లో ఆయన బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది.


పారదర్శక పాలన అందించాలి

జిల్లా ఇన్‌చార్జి అధికారి విజయరామరాజు



మాట్లాడుతున్న విజయరామరాజు

అనంతపురం టౌన్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ప్రజలకు పారదర్శక సేవలు అందించాలని పాఠశాల విద్య కమిషనర్, జిల్లా ఇన్‌చార్జి అధికారి విజయ రామరాజు అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్, జిల్లా అధికారులతో శనివారం రాత్రి ఆయన సమీక్ష నిర్వహించారు. పనుల మీద వచ్చిన ప్రజలను సాదరంగా ఆహ్వానించి, గౌరవంగా మాట్లాడాలని సూచించారు. ప్రజలను ఇబ్బంది పెట్టకుండా, వారి సమస్యలను పరిష్కరించాలని అన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఎంతో ముఖ్యమైనదని, పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. ఉద్యోగాల సృష్టి ఎంతో గొప్పదని, చట్టప్రకారం వ్యాపారులు వ్యాపారం చేసుకుంటున్నారా లేదా అనేది పరిశీలించాలని అన్నారు. వేసవి నేపథ్యంలో సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకుని అమలు చేయాలని అన్నారు. తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని, నీటిని రవాణా అవసరం లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. నియోజకవర్గాల్లో ఏపీఐఐసీ కింద పార్కుల ఏర్పాటుకు అవసరమైన భూమి గుర్తించాలని సూచించారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను అన్ని పంచాయతీల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. డ్వామా కింద కేటాయించిన లక్ష్యాలను ఎప్పటికప్పుడు చేరుకోవాలని అన్నారు. నియోజకవర్గానికి ఒక స్కిల్ సెంటర్ ఏర్పాటు చేసుకోవాలని, అన్నిశాఖల పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలను, ప్రభుత్వ పథకాలను జాగ్రత్తగా అమలు చేయాలని సూచించారు. సమీక్షలో అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, డీఆర్వో మలోల, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు తిప్పేనాయక్, మల్లికార్జున, ఆనంద్, ఆర్డీఓలు కేశవనాయుడు, వసంత బాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు



శ్రీవారికి పట్టువస్త్రాలు తీసుకెళుతున్న సీఎం చంద్రబాబు దంపతులు





పట్టువస్త్రాలు సమర్పిస్తున్న చంద్రబాబు దంపతులు, బీఆర్ నాయుడు

అమరావతిలో.. శ్రీవారి కల్యాణోత్సవం

రాజధాని అమరావతి వెంకటపాలెంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ప్రప్రథమంగా శనివారం శ్రీవారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చరణల మధ్య అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకుడి కల్యాణాన్ని తిలకించిన భక్తజన సందోహం పరవశించింది. విద్యుత్ వెలుగులతో కల్యాణ ప్రాంగణం కాంతులీనగా భక్తుల జయజయధ్వానాల మధ్య కన్నుల పండువగా జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దంపతులు, గవర్నర్ అబ్దుల్ నజీర్ తదితరుల సమక్షంలో టీటీడీ వేద పండితులు స్వామివారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులను భాగస్వాములను చేస్తూ కైంకర్యాలను నిర్వహించారు.

-తుళ్లూరు, ఆంధ్రజ్యోతి



గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు



చంద్రబాబుకు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న బీఆర్ నాయుడు



వెంకటపాలెంలోని వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న గవర్నర్ అబ్దుల్‌నజీర్, సీఎం చంద్రబాబు దంపతులు, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తదితరులు



సీఎం చంద్రబాబుకు వేంకటేశ్వరస్వామి జ్ఞాపికను అందజేస్తున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు

లైనింగ్ పనులు రద్దు చేయండి

జలసాధన సమితి నాయకులు



కలెక్టర్‌తో మాట్లాడుతున్న జలసాధన సమితి నాయకులు

హిందూపురం అర్బన్, మార్చి 15, (ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులు రద్దు చేసి, కాలువ వెడల్పు చేసే విధంగా ప్రభుత్వానికి నివేదికలు పంపాలని కలెక్టర్ చేతన్‌ను జలసాధన సమితి ఉమ్మడి జిల్లా నాయకులు కోరారు. వారు ప్రభుత్వ ఆసుపత్రిలో కలెక్టర్‌ను శనివారం కలిసి వినతి అందించారు. వారు మాట్లాడుతూ కాలువకు సంబంధించి మాల్యాల నుంచి జీడిపల్లి 216 కిలో మీటర్ల వరకు 3850 క్యూసెక్కుల సామర్థ్యం మేర నీరు వదలడానికి రూ. 696 కోట్లు, జీడిపల్లి 216 కిలోమీటర్లు నుంచి 400 కిలో మీటర్లు వరకు కాలువ లైనింగ్ చేయడానికి రూ. 936.7 కోట్లను ప్రభుత్వం జీఓ 404, 405ల ద్వారా విడుదల చేసిందన్నారు. కాలువ లైనింగ్ ద్వారా అధిక ఖర్చు తప్పా ప్రయోజనం ఉండదని తెలిపారు. కార్యక్రమంలో జలసాధన సమితి అధ్యక్షుడు ధనాపురం వెంకటరామిరెడ్డి, ఓపీడీఆర్ శ్రీనివాసులు, గంగిరెడ్డి, జమీల్, సిద్దారెడ్డి, తదితరులు ఉన్నారు.

కాళేశ్వర్ ఆశయ సాధనకు కృషి

షిర్డీసాయి గ్లోబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ శిల్ప



పోలీసు అధికారులకు చెక్కును అందజేస్తున్న శిల్ప

పెనుకొండ, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, దివంగత సాయి కాళేశ్వర్ ఆశయ సాధనకు కృషి చేస్తున్నట్లు గ్లోబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ శిల్ప పేర్కొన్నారు. స్థానిక శివసాయి మందిరం ప్రాంగణంలో సాయికాళేశ్వర్ 13వ వర్ధంతిని గ్లోబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సీనియర్ న్యాయవాది గురుప్రసాద్, కాళేశ్వర్ తండ్రి సుబ్బారాయుడు, డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ రాఘవన్, ఎస్ఐ వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ముందుగా కాళేశ్వర్ సమాధికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో శిల్ప మాట్లాడుతూ కాళేశ్వర్ పేదల సంక్షేమమే ధ్యేయం గా కులమతాలకు అతీతంగా అన్నీ వర్గాల వారికి ఎన్నో సేవా కార్యక్రమా లు చేపట్టారన్నారు. అనంతరం పెనుకొండలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం కోసం పోలీసులకు రూ.28లక్షల చెక్కును అందజేశారు. కంటి ఆసుపత్రిలో ఆపరేషన్ చేసుకున్నవారికి ఉచితంగా కంటి అద్దాలు అందజేశారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ కాళేశ్వర్ మృతి పెనుకొండ ప్రజలకే కాక జిల్లా ప్రజలకు తీరనిలోటన్నారు. కార్యక్రమంలో నాగిరెడ్డి, చిట్టిబాబు, హరి, బాబుప్రసాద్, ప్రగతి శ్రీనివాసులు, మానవహక్కుల జిల్లా అధ్యక్షుడు జాన్ ప్రియనాథ్, ఆశ్రమ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే స్వచ్ఛాంధ్ర

ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ మునిప్రసాద్

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణతోనే స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర నిర్మాణం సాధ్యమవుతుందని ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ మునిప్రసాద్ పేర్కొన్నారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర సాధనలో భాగంగా శనివారం స్థానిక ఎస్ఎస్‌బీఎన్ కళాశాల నుంచి ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో గ్రీన్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ సప్తగిరిసర్కిల్, సుభాష్‌రోడ్డు మీదుగా క్లాక్‌టవర్ వరకు సాగింది. ఈ సందర్భంగా మునిప్రసాద్ మాట్లాడుతూ వాతావరణాన్ని కలుషితం చేస్తున్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నివారించాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో డీఎఫ్‌ఓ శ్రీనివాసరెడ్డి, డీఐసీ జనరల్ మేనేజర్ కృష్ణమూర్తి, కార్మికశాఖ, డీఎంహెచ్‌ఓ కార్యాలయం, నగరపాలక సంస్థనుంచి అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు విజయ్‌కుమార్, అనీల్‌కుమార్, టీవీ రెడ్డి, పరిశ్రమల ప్రతినిధులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



గ్రీన్ ర్యాలీ జెండా ఊపి ప్రారంభిస్తున్న మునిప్రసాద్

నెలాఖరు నుంచి హెచ్చెల్సీ పనులు : ఎస్ఈ

బొమ్మనహాళ్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఈ నెలాఖరు నుంచి హెచ్చెల్సీ అత్యవసర పనులు ప్రారంభం అవుతాయని ఎస్ఈ రాజశేఖర్ తెలిపారు. మండలంలోని క్రిష్ణాపురం, ఉంతకల్లు, మైలాపురం, ఉద్దేహాళ్ గ్రామ సమీపంలోని 126, 105, 109 కి.మీ. వద్ద కాలువ, వంతెనలను శనివారం ఆయన పరిశీలించారు. కాలువలో నీటి ప్రవాహానికి అడ్డంగా లేకుండా చూడాలని స్థానిక అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ 105 కి.మీ. నుంచి 189 కి.మీ. వరకు 10 పనులు రూ. 34.95 కోట్లతో జరుగుతాయన్నారు. జూలై నాటికి పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. బొమ్మనహాళ్ మండలంలో రూ. 16 కోట్ల వ్యయంతో వంతెన, లైనింగ్ పనులు జరుగుతాయని తెలిపారు. నిరంతర పర్యవేక్షణ, పరిశీలన చేసి పనులు నాణ్యతగా ఉండేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జేఈఈ అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.



హెచ్చెల్సీని పరిశీలిస్తున్న ఎస్ఈ రాజశేఖర్

ఓ పెళ్లి ప్రయత్నం...

రెండు ఆత్మహత్యలు

మూడు రోజుల వ్యవధిలో కుమారుడు, తల్లి బలవన్మరణం



శైలజ (ఫైల్) శ్రీచరణ్ (ఫైల్)

తాడిపత్రి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఓ పెళ్లి ప్రయత్నం రెండు ఆత్మహత్యలకు దారి తీసింది. బంధువులు పెళ్లి సంబంధం తల్లి వద్దన్నదని కుమారుడు మూడు రోజుల కిందట ఆత్మహత్య చేసుకున్నాడు. దీనికి నువ్వే కారణమని బంధువుల సూటిపోటి మాటలు అనడంతో కలత చెందిన తల్లి శనివారం ఆత్మహత్య చేసుకుంది. భార్య, కుమారుడి అకాల మృతితో ఏకాకిగా మిగిలిన సురేంద్రబాబు రోదనలు పలువురిని కంటతడి పెట్టించాయి. తాడిపత్రికి చెందిన ఓ కుటుంబ విషాద సంఘటన ఇది. వివరాలు ఇలా.. పట్టణానికి చెందిన శైలజ(42), సురేంద్రబాబు దంపతులకు ఏకైక కుమారుడు శ్రీచరణ్ (20) డిప్లొమా పూర్తిచేసి ఉద్యోగాన్వేషణలో ఉండేవాడు. సురేంద్రబాబు కూలిపనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొద్ది రోజుల నుంచి శ్రీచరణ్‌కు పెళ్లి సంబంధాలు చూడటం మొదలుపెట్టారు. బంధువుల్లోనే ఓ సంబంధం ఉండగా, దాన్ని శైలజ ఒప్పుకోలేదు. దీంతో మనస్తాపం చెందిన శ్రీ చరణ్ ఈనెల 12న అనంతపురం సమీపంలోని ప్రసన్నాయపల్లి వద్ద రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. ఈక్రమంలో శైలజ ఒప్పుకోకపోవడంతోనే కుమారుడు చనిపోయాడని బంధువులు సూటిపోటి మాటలు అన్నారు. దీంతో మనస్తాపం చెందిన శైలజ శనివారం పట్టణ సమీపంలోని పుట్లూరు రైల్వేగేటు వద్ద రైలుకిందపడి శైలజ ఆత్మహత్య చేసుకుందని పోలీసులు శనివారం తెలిపారు. కేసు నమోదు చేసినట్లు రైల్వే ఎస్ఐ నాగప్ప తెలిపారు.

జర్దోసి మగ్గం వర్క్‌పై ఉచిత శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రూడ్‌సెట్‌లో జర్దోసి మగ్గం వర్క్‌పై 30రోజుల పాటు ఉచిత శిక్షణ ప్రారంభించను న్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ విజయలక్ష్మి శనివారం తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 18-45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన మహిళలు అర్హులన్నారు. ఏప్రిల్ మూడో తేదీ నుంచి ప్రారంభించే ఉచిత శిక్షణకు సంబంధించి పేర్ల నమోదు, వివరాలకు సెల్ నంబరు 9492583484ను సంప్రదించాలని కోరారు.

న్యూస్ బాక్స్

ఘనంగా కాటమయ్యస్వామి తిరునాళ్ల



పూజలందుకుంటున్న స్వామివారు

బత్తలపల్లి మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంజీవపురం సమీపంలో ఉన్న కాటమయ్యస్వామి కొండవద్ద స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 3రోజు అయిన శనివారం తిరుణాల నిర్వహించారు. కాటికోటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు భక్తులు ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని తమ మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గంగమ్మస్వామిని దర్శించుకున్నారు. తిరుణాళ్లకు హాజరైన మహిళలు గాజులు కొనుగోలు చేసేందుకు పోటీ పడ్డారు. సాయంత్రం కాటమయ్యస్వామి ప్రభ ముస్తూరు గ్రామానికి తరలించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ ప్రభాకర్, ఎస్‌ఐ సోమశేఖర్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

విలువలతో కూడిన విద్యను అభ్యసించాలి



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ధర్మవరం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి నైతికవిలువలతో కూడిన విద్యను అభ్యసించాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్ సూచించారు. స్థానిక నాగార్జున ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో శనివారం వార్షికోత్సవ వేడుకలను స్థానిక షిర్డీసాయిబాబా కల్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. వేడుకులకు ఆయన హాజరై ప్రసంగించారు. ప్రతి ఏడాదిలాగే పది ఫలితాల్లో మంచి మార్కులు సాధించాలన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమా లు అందరినీ ఆకట్టుకున్నాయి. పాఠశాల చైర్మన్ ప్రమీల, కరస్పాండెంట్ డోలా పెద్దిరెడ్డి, ప్రిన్సిపాల్ బాలాంజనేయులు, మేనేజ్‌మెంట్ ఎర్రిస్వామి, సురేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

కొత్తచెరువు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని తలమర్లలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని కియ కార్ల కంపెనీ సహకారంతో పీఆర్‌డీఎస్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించినట్లు సంస్థ నిర్వాహకుడు ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. శిబిరంలో 145 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 31 మందిని ఆపరేషన్లకు ఎంపికచేసినట్లు ఆయన తెలిపారు. 40 మందికి కంటి అద్దాలకు ఎంపికయ్యారన్నారు. శిబిరంలో ఆప్తాల్మిక్ బషీర్, వైద్యసిబ్బంది, సంస్థ ప్రతినిధి శ్రీధర్, ల్యాబ్ టెక్నీషియన్ మురళి పాల్గొన్నారు.

హైకోర్టు తీర్పును అమలుచేయాలి

గాండ్లపెంట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): జీతాల పెంపుపై హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని పంచాయతీ సంఘం కార్యదర్శి బాషాకు శనివారం వినతిపత్రం అందచేశారు. కార్మికులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి జీతాల పెంపుతోపాటు 501, 132, 142, 680 జీవోలు అమ లు చేయాలన్నారు. తాము ప్రజాఆరోగ్యాన్ని, పర్యావరణా న్ని కాపాడుతున్నామన్నారు. తమ బాగోగులను ప్రభు త్వం పట్టించుకోలేదని 8 సంవత్సరాలుగా పైసా జీతం పెంచలేదన్నారు. వెంటనే జీతాలు పెంచాలని కోరారు. నరసింహులు, అక్కులప్ప, కదిరిప్ప, ఆంజనేయులు, కార్మికులు పాల్గొన్నారు.

ఆప్‌కాస్ విధానాన్ని కొనసాగించాలి

కదిరిఅర్బన్, మార్చి15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగాల్లో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ కార్మికులను ఆప్‌కాస్ వ్యవస్థలోనే కొనసాగించాలని సీఐటీయూ నాయకులు పేర్కొన్నారు. శనివారం బీసీ వెల్ఫేర్ అధికారి బాలాజీకి వినతిపత్రం అందచేశారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అవుట్‌సోర్సింగ్ కార్మికులకు సంక్షేమపథకాలు అమలుచేయాలని, రిటైర్మెంట్ వయస్సును 62 ఏళ్లకు పెంచాలన్నారు. జీఎల్ నరసింహులు, సాంబశివ, ముస్తాక్ పాల్గొన్నారు.

గొడుగుల పంపిణీ

కదిరిఅర్బన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): హార్ట్ టు హెల్ప్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో చర్మకార వృత్తిదారులకు గొడుగులు పంపిణీ చేసినట్లు ట్రస్టు అధ్యక్షుడు మూడే రవినాయక్ తెలిపారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో చర్మకారులు ఎండకు ఇబ్బందులు పడుతుండటాన్ని గుర్తించి, ఏడుగురికి గొడుగులు అందించామన్నారు.

విద్యార్థి అదృశ్యం.. కేసు నమోదు



లక్ష్మీకాంత్‌రెడ్డి

నల్లమాడ, మార్చి15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎద్దులవాండ్లపల్లికి చెందిన రామమోహన్‌రెడ్డి కుమారుడు లక్ష్మీకాంత్‌రెడ్డి అదృశ్యమయ్యాడని శనివారం ఫిర్యాదు చేసినట్లు ఏఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు. ఆయన తెలిపిన మేరకు లక్ష్మీకాంత్‌రెడ్డి అనంతపురంలోని పీవీవీకేకే కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈయేడాది జనవరి 7వతేదీన సంక్రాంతి సెలవులకు స్వగ్రామానికి వచ్చాడు. తల్లిదండ్రులు పనుల కోసం బెంగళూరు వలస వెళ్లారు. తల్లిదండ్రులకు ఫోన్ చేసి, ఎద్దులవాండ్లపల్లికి వచ్చానని, ద్విచక్రవాహనంలో బెంగళూరుకు వస్తున్నట్లు చెప్పాడు. ఆరోజునుంచి ఇప్పటివరకు కనిపించకపోవడంతో బెంగళూరులో, బంధువుల గ్రామల్లో వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో తండ్రి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

గుప్తనిధులు తవ్వుతున్న వ్యక్తుల అరెస్టు

నల్లమాడ, మార్చి15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుంకలమ్మ గుడి వద్ద గుప్తనిధులు తవ్వకాలకోసం వచ్చిన ఐదుగురిని అరెస్టు చేసినట్లు సీఐ నరేంద్రరెడ్డి శనివారం తెలిపారు. సుంకలమ్మ గుడి వద్ద గుప్తనిధులున్నాయని తవ్వుతున్నట్లు సమాచారం వచ్చిందని, సిబ్బందితో వెళ్లి వారిని పట్టుకున్నామన్నారు. వారిని విచారించగా గోరంట్లకు చెందినవారుగా గుర్తించామన్నారు. మారుతీకుమార్ తండ్రి కుళ్లాయ్యప్ప, శ్రీరాములు తండ్రి గంగయ్య, నరసింహులు తండ్రి ఏటప్ప, హార్షీలా తండ్రి అక్బర్‌వలీ, గోపీ తండ్రి క్రిష్ణగా గుర్తించామన్నారు. వీరు కేఏ03 ఎఎఫ్ 0392 నంబరు గల కారునుకూడా స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే వారి వద్ద ఉన్న వస్తువులను, సెల్‌ఫోన్‌ను సీజ్ చేసి, కేసు నమోదు చేశామన్నారు.

ప్రైవేటు కళాశాల ప్రిన్సిపాల్‌పై కేసు నమోదు

కదిరి, మార్చి15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించిన విషయంలో అమృతవల్లి డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ వెంకటపతిపై కేసు నమోదు చేసినట్లు సీఐ నారాయణరెడ్డి శనివారం తెలిపారు. శుక్రవారం డిగ్రీకళాశాలలో ప్రిన్సిపాల్ కొంతమంది విద్యార్థులు కలిసి కళాశాల ఆవరణలో హోలీ పండుగను అడుపెట్టుకుని విద్యార్థినులపై భౌతికంగా తాకుతూ అసభ్యకరంగా ప్రవర్తించిన విషయాన్ని సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయన్నారు. దీనిపై విచారించి, మహిళా కానిస్టేబుల్ గౌసియాకు వచ్చిన ఫిర్యాదు మేరకు సెక్షన్ 75 బీఎన్ఎస్ కింద టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదుచేసినట్లు సీఐ తెలిపారు.

ధరలేక బీట్‌రూట్ రైతుల విలవిల

- కొనే నాథుడు కరువు.. రూ.లక్షల్లో నష్టం
- పంటను పశువులకు వదిలేసిన వైనం
- ప్రభుత్వం ఆదుకోవాలని రైతుల వినతి



పొలాల్లోనే వదిలేసిన బీట్‌రూట్ పంట

తనకల్లు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): కొనేవారు లేక బీట్‌రూట్ రైతులు విలవిల్లాడుతున్నారు. అమాంతం ధరలు పడిపోవడంతో పంటను పశువులకు వదిలేస్తున్నారు. తనకల్లు మండలం ఇటు కర్ణాటక, అటు అన్నమయ్య జిల్లాకు సరిహద్దుగా ఉంది. మండలంలో పండించిన కూరగాయాలు, ఆకుకూరలు, ఉద్యానవన పంటలు ఎక్కువగా చెన్నై, బెంగళూరు మార్కెట్‌కు తరలిస్తుంటారు. దీంతో కొత్తరకాల పంటలు సాగుచేయడానికి రైతులు ఎక్కువగా మొగ్గుచూపుతున్నారు. కర్ణాటకలో పండించే వివిధ రకాల పంటలను మండలరైతులు సాగుచేయడం, లాభాలు ఆర్జించడం కొనసాగుతూ వస్తోంది. ఈయేడాది రైతులు నూతనంగా బీట్‌రూట్ పంటను సాగుచేశారు. మండలంలోని మండ్లిపల్లి, బొంతలపల్లి, మార్పూరివాండ్లపల్లి, నందిగానిపల్లి, తవళం తదితర గ్రామాల్లో ఈ పంటను సాగుచేశారు. పంట సాగుచేయడానికి విత్తనాలను కర్ణాటక ప్రాంతంలో కొనుగోలు చేశారు. విత్తనాలు, ఎరువులు, దుక్కులు, మందులు, కూలీల కోసం ఎకరాకు రూ.60వేలనుంచి 80వేలదాకా రైతులు ఖర్చు చేశారు. కొత్తరకం పంట కావడంతో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని రైతులు మంచి దిగుబడి సాధించారు. పంట ఏపుగా పెరిగింది. బీట్ రూట్ గడ్డలుకూడా బాగా వచ్చాయి.

పశువులకు పంటను వదిలేసిన రైతులు

అయితే మార్కెట్‌లో కనీసం అడిగే నాథుడే కరువయ్యాడు. దీంతో రైతులు చేసేది లేక పశువులకు వదిలివేయాల్సి వస్తోంది. మండలలోని వివిధ గ్రామాల్లో 50 ఎకరాల్లో బీట్‌రూట్ పంటను సాగుచేసిన రైతులకు పెట్టుబడి రూపంలోనే రూ.40లక్షలు నష్టం వాటిల్లింది. పంటలు సాగుచేసి, రైతులు నష్టపోతున్నా, సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారే తప్ప ఎలాంటి సాయం అందించడంలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పెట్టుబడి కూడా రాకుండా అడిగే నాథుడే లేక పొలాల్లోనే పంటను వదిలేశామని, ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

మూడు ఎకరాల్లో సాగుచేశా



కొత్తరకం పంటలు సాగుచేస్తే గిట్టుబాటు ధర వస్తే లాభాలోస్తాయన్న ఆశతో బీట్‌రూట్‌ను మూడు ఎకరాల్లో సాగుచేశా. పంట సాగుచేసేందుకు ఎకరాకు రూ.60నుంచి 80వేలు ఖర్చు చేశాం. పంట బాగా పండినా, మార్కెట్‌లో అడిగేనాథుడే లేక పంటను కోయకుండా అలాగే వదిలేశాం. ప్రభుత్వాలు రైతులను ఆదుకోవాలి.

- లోక్‌నాథ్‌రెడ్డి, రైతు, మండ్లిపల్లి

నష్టం అంచనా వేయాలి



కొత్తరకం పంట బీట్‌రూట్‌ను 2 ఎకరాల్లో సాగుచేశాం. రూ.లక్షకు పైగా పెట్టుబడి నష్టపోయా. పంట కోయకుండా పశువులకు వదిలేశా. నాకష్టకంటే, పెట్టుబడి పోయిందన్న బాధే అధికంగా ఉంది. కనీసం సాయం చేయపోయినా, అధికారులు నష్టాన్ని అంచనా వేయకపోవడం బాధగా ఉంది. ప్రభుత్వాలు రైతులను ఆదుకోవాలి.

- జయరామిరెడ్డి, మండ్లిపల్లి

స్వచ్ఛ ధర్మవరమే అందరి లక్ష్యం

● మంత్రి సత్యకుమార్ యాదవ్



రోడ్డుపై ఉన్న చెత్తను ఎత్తుతున్న మంత్రి

ధర్మవరం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ధర్మవరం లక్ష్యంగా ముందుకు సాగుదామని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో గాంధీ నగర్ రైల్వేస్టేషన్ రోడ్డు వద్ద శనివారం ఉదయం స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి హాజరయ్యారు. ముందుగా మంత్రి స్వచ్ఛత ప్రతిజ్ఞను చేయించారు. అనంతరం నూతనంగా ఏర్పాటుచేసిన పార్కులో మంత్రి మొక్కలు నాటారు. కార్యక్రమానికి పక్కనే ఉన్న 19వవార్డులో పరిసరాల పరిశుభ్రత అవగాహనలో భాగంగా మంత్రితోపాటు కమిషనర్, బీజేపీ నాయకులు చీపురుపట్టి రోడ్లను శుభ్రం చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. పరిసరాల పరిశుభ్రత వల్ల ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించుకోవచ్చన్నారు. ధర్మవరంలో చాలా కాలంగా పేరుకుపోయిన చెత్తను తొలగించేక్రమంలో ఎంఆర్ఎఫ్ ప్రాజెక్టు రూ.2.50 కోట్లతో డంపింగ్‌యార్డ్ వర్మికంపోస్టును ఏర్పాటుచేశామన్నారు. అనంతరం చెత్త సేకరణకు ఏర్పాటుచేసిన తోపుడుబండ్లను ప్రారంభించారు. ఆర్డీఓ మహేశ్, కమిషనర్ ప్రమోద్‌కుమార్, ఏపీసీడ్స్ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ కమతం కాటమయ్య, టీడీపీ నాయకులు, చేనేత ప్రముఖులు సందారాఘవ, కేశగాళ్ల శీన, బీజేపీ మాజీ అధ్యక్షుడు సందిరెడ్డిశ్రీనివాసులు, జింకా చంద్ర, గొట్లూరు చంద్ర, క్రిష్ణాపురం జమీర్, నబీరసూల్, కంచం లీలావతి, బిల్లేశీన పాల్గొన్నారు.

గొప్పవారు అందరూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారే

బత్తలపల్లి: భారతదేశంలో పెద్ద గొప్పవారందరూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసించిన వారేనని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ అన్నారు. స్థానిక బాలికల పాఠశాల ఆవరణలో నూతనంగా నిర్మించిన బాలికల వసతి గృహాన్ని శనివారం మంత్రి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక లక్ష్యం పెట్టుకుని బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు మంత్రి లోకేశ్ కృషి చేస్తున్నరని అన్నారు. ఆర్డీఓ మహేష్, తహసీల్దార్ స్వర్ణలత, ఎంపీడీఓ నరసింహనాయుడు, ఈఓఆర్డీ కిష్టప్ప, నాయకులు కోటిసుదా జక్కంపూటి నాగభుషణ, సతీష్, సురేంద్రనాయుడు, నారాయణస్వామి పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

నల్లమాడ, మార్చి 15(ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామాపురం వద్ద అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో పది చదువుతున్న బాలికలకు సామగ్రిని పుట్టపర్తి సత్యసాయిబాబా భక్తుడు హరినాథ్ ఆధ్వర్యంలో శనివారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఖిత్‌మత్ ఏ కలక్ చారిటబుల్ ట్రస్టు సహకారంతో పంపిణీ చేశామన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు తమ వంతు సాయం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రసాద్, జావీద్, షాజీద్, ప్రిన్సిపాల్ సుధారాణి, రాజ్యలక్ష్మీ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి : సీఐ

కదిరి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 5 వార్డులో సీఐ నారాయణరెడ్డి శనివారం రాత్రి పల్లె నిద్ర చేశారు. వార్డు ప్రజలతో ఆయన సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ మత్తుపదార్థాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు. పిల్లల నడవడికపై తల్లిదండ్రులు దృష్టి సారించి చెడుమార్గంలోకి వెళ్లకుండా చూడాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు. అలాగే మైనర్లకు ద్విచక్రవాహనాలు ఇవ్వకూడదన్నారు. సైబర్‌నేరాలు, చోరీలు, చైన్‌స్నాచర్స్‌పై అవగాహన కల్పించారు. 5వార్డు టీడీపీ ఇన్‌చార్జి ఇమ్రాన్, పోలీస్ సిబ్బంది, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

అగ్నికి ఆహుతైన 19 గొర్రెలు

పుట్టపర్తి రూరల్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగిరెడ్డిపల్లిలో శనివారం సాయంత్రం 19 గొర్రెలు అగ్నికి ఆహుతయ్యాయి. గ్రామస్థులు, కాపరి నాగరాజు తెలిపిన మేరకు గంగిరెడ్డిపల్లి సమీపంలోని గుడబాపనికుంట అటవీప్రాంతంలోకి మేత కోసం గొర్రెలు తోలుకెళ్లాడు. ఆకతాయిలు అడవికి నిప్పుపెట్టడంతో గొర్రెల మేతమేస్తున్న ప్రాంతాన్ని అగ్నికీలలు చుట్టుముట్టడంతో మంటల్లో చిక్కుకుని 19 గొర్రెలు మృత్యువాతపడ్డాయి. గొర్రెలు మేపుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నానని, తనకు జీవనాధారమైన గొర్రెలు కళ్లెదుటే సజీవదహనవుతుంటే ఏమీ చేయలేకపోయానని కాపరి బోరున విలపించాడు. రూ.2లక్షల వరకు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వమే ఆదుకోవాలని ఆయన కోరారు.

ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేయండి



మంత్రిసత్యకుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న యువకులు

ముదిగుబ్బ, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బ్యాడ్మింటన్ ఇండోర్‌స్టేడియం ఏర్పాటుచేయాలని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్‌కు శనివారం యువకులు వినతిపత్రం అందజేశారు. అతి పెద్ద మండలమైన ముదిగుబ్బలో చాలా మంది బ్యాడ్మింటన్ క్రీడాకారులు ఉన్నారని, స్టేడియంలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ముదిగుబ్బలో ఇండోర్‌స్టేడియంను ఏర్పాటు చేసి క్రీడాకారులను ప్రోత్సహించాలని యువకులు మంత్రిని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందిస్తూ ఇండోర్ స్టేడియం విషయం ఇదివరకే నా దృష్టికి వచ్చిందని, ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు. బాబ్జాన్, ఠాగూర్, బాబావలి, ప్రకాశ్, ఇమాం, దాదాపీర్, వంశీ, షెక్షా, మధు పాల్గొన్నారు.

వడ్డెర్లకు కమ్యూనిటీ భవనం కేటాయించాలి

ఓబుళదేవరచెరువు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మండలంలో అధిక జనాభా ఉన్న వడ్డెర వర్గానికి కమ్యూనిటీ భవనం కేటాయించాలని, వడ్డే ఓబన్న విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని శనివారం నాయకులు తహసీల్దార్ అనంతాచారికి వినతిపత్రం అందజేశారు. వడ్డెర సంఘం యువజన అధ్యక్షుడు ఇడగొట్టు వీరాంజి, పీట్ల సుధాకర్, శ్రీనివాసులు మాట్లాడుతూ సర్వేనెంబర్ 216లో ఎం.కొత్తపల్లిలో ప్రభుత్వ భూమి ఉందని, అందులో వడ్డెర్లకు కమ్యూనిటీ భవనానికి స్థలం కేటాయించాలన్నారు. ఉప్పటోళ్ల రమణప్ప, ఇడగొట్టు సోము, చలపతి పాల్గొన్నారు.

స్వచ్ఛతలో పుట్టపర్తిని ప్రథమ స్థానంలో నిలుపుదాం

● ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి



పుట్టపర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే పల్లె

పుట్టపర్తి రూరల్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికకేంద్రం పుట్టపర్తిని పరిశుభ్రంగా ఉంచి ప్రథమస్థానంలో నిలుపుదామని ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి అన్నారు. స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే, మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాద ఇతర అధికారులు, నాయకులతో కలిసి శనివారం పట్టణంలో మున్సిపల్ కార్యాలయం నుంచి కర్ణాటకనాగేపల్లి బ్రిడ్జివరకు ర్యాలీ నిర్వహించారు. పట్టణంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని పిలుపినిచ్చారు. సంపూర్ణప్లాస్టిక్ నిషేధానికి ప్రతిఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. అనంతరం మాజీమంత్రి పల్లె మాట్లాడుతూ ప్రశాంతతకు మారుపేరైన పుట్టపర్తిలో పరిశుభ్రతకు చిరునామాగా మార్చాలని, పరిశుభ్రత విషయంలో అధికారులు నిక్కచ్చిగా వ్యవహరించాలని క్లీన్ ఆంధ్ర క్లీన్‌పుట్టపర్తిని సాధిద్దామని అన్నారు. ప్రజాప్రతినిధులు రత్నప్పచౌదరి, నాయకులు సామకోటిఆదినారాయణ, ఉమాపతి, మున్సిపల్ సిబ్బంది, కార్యకర్తలు పాల్గొన్నారు.

బుక్కపట్నం: రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లక్ష్యమని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పాముదుర్తిలో రూ.1.79 కోట్లతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యేతో పాటు మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రాష్ట్రంలోని ప్రజలందరికీ కార్పొరేట్ వైద్యం అందించడానికి సీఎం కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ గుర్రంపాటి జ్యోతి, వైద్యాధికారులు వెంకటనారాయణరెడ్డి, జ్యోతి, టీడీపీ కన్వీనర్ మల్లిరెడ్డి, నాయకులు క్రిష్ణమూర్తి, నరేష్, గంగాధర్, ఆంజనేయులు, క్రిష్టప్ప, శివారెడ్డి పాల్గొన్నారు.

గాండ్లపెంట: ప్రతి గ్రామం స్వచ్ఛంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని తహసీల్దార్ బాబూరావు అన్నారు. శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరామిరెడ్డి, ఎంఈఓలు క్రిష్ణానాయక్, శ్రీనివాసులు, ఈఓఆర్‌డీ సునీత, సర్పంచ్ రహంతుల్లా, ప్రసాద్, ఆనంద్, సిద్దారెడ్డి పాల్గొన్నారు.

ధర్మవరం: స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆవరణలో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆస్పత్రి పరిసరాలను శుభ్రం వైద్యులు, సిబ్బంది శుభ్రం చేశారు. సూపరింటెండెంట్ మాధవి పాల్గొన్నారు. కేహెచ్ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు కార్యక్రమం నిర్వహించారు. ఆస్పత్రి అభివృద్ధికమిటీ సభ్యులు గూండపుల్లయ్య, కంటివైద్య నిపుణుడు నరసింహులు పాల్గొన్నారు.

బుక్కపట్నం: ప్రజలు ప్లాస్టిక్‌కు దూరంగా ఉండాలని పీడీఓ సమత సూచించారు. శనివారం మండలకేంద్రంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. డీపీఓ దగ్గరుండి పంచాయతీ సిబ్బందితో పరిసరాలు శుభ్రం చేయించారు. ఎంపీడీఓ శ్రీనివాసులు, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, సర్పంచ్ నాగలక్ష్మి, ఈఓఆర్‌డీ అశోక్‌రెడ్డి, పంచాయతీ సెక్రటరీ సాదిక్ వలీ, టీడీపీ నాయకులు సయ్యద్‌బాషా, మంజునాథ్, వాజీద్ పాల్గొన్నారు.



బుక్కపట్నంలో స్వచ్ఛాంధ్రలో పాల్గొన్న డీపీఓ సమత



17వ తేదీకి కూడా సంతకాలు చేసిన రిజిస్టర్‌ను చూపుతున్న ఎమ్మెల్యే

గురుకుల పాఠశాల తనిఖీ

- విస్తుపోయే నిజాలు బహిర్గతం
- 17వ తేదీకి ముందే రిజిస్టర్‌లో సంతకాలు
- ప్రిన్సిపాల్‌పై ఎమ్మెల్యే కందికుంట ఆగ్రహం

తనకల్లు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని సీజీ ప్రాజెక్టు వద్దనున్న గిరిజన బాలికల పాఠశాలను ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ శనివారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో విస్తుపోయే నిజాలు వెల్లడయ్యాయి. పాఠశాలలో పనిచేస్తున్న సిబ్బంది, ఉపాధ్యాయులు హాజరు పట్టికలో 17వ తేదీకి కూడా సంతకాలు చేసి ఉండటాన్ని గుర్తించిన ఎమ్మెల్యే ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ సుశ్మిత జ్యోత్స్న దృష్టికి తీసుకురాగా, ఆమె సమాధానం మరింత విస్తుపోయేలా చేసింది. రాత్రి సమయంలో తరగతులు చెప్పడానికి రావాల్సిన ఏడుగురు ఉపాధ్యాయులు, 17వతేదీ రావాల్సిన ఉపాధ్యాయులు డ్యూటీకి వచ్చినట్లు ప్రిన్సిపాల్ సంతకాలు చేసి ఉండడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేమిటని ప్రశ్నించారు. సిబ్బంది విధులకు హాజరుకాకపోయినా, వారి ఆత్మలేమైనా వచ్చి సంతకాలు చేశాయా అని ప్రిన్సిపాల్‌ను ఎమ్మెల్యే నిలదీశారు. ఎమ్మెల్యే ప్రశ్నిస్తున్నా అది అంతే అన్నట్లుగా ప్రిన్సిపాల్ వ్యవహరించారు. హాజరు రిజిస్టర్‌లో 29మంది ఉపాధ్యాయులు, సిబ్బంది సంతకాలు చేశారు. విధుల్లో ఎంతమంది ఉన్నారని ప్రశ్నించగా, కేవలం ఇద్దరు మాత్రమే ఉన్నట్లు గుర్తించారు. విధుల్లో లేని వ్యక్తుల గురించి ఆరా తీయగా, సెలవు పెట్టినట్లు తెలిపారు. సెలవు చీటీలు ఏవని ఎమ్మెల్యే ప్రశ్నించగా, పక్కనే ఉన్న తెలుగు ఉపాధ్యాయురాలు జ్యోతిచే సెలవు చీటీ తయారు చేయించే పనిలో ప్రిన్సిపల్ నిమగ్నమయ్యారు. వీటన్నింటిన్ని గమనిస్తున్న ఎమ్మెల్యే పరిసరాలను పరిశీలించారు. కొంతమంది విద్యార్థినులు ఎమ్మెల్యే వద్దకు వచ్చి రాత్రిపూట ఆగంతుకులు హాస్టల్ గదుల్లోకి వస్తున్నట్లు తెలిపారు. దీంతో ఎమ్మెల్యే ఏదైనా జరగరానిది జరిగితే అందరం తలదిచ్చుకునే పరిస్థితి వస్తుందని, ఈవిషయంలో సిబ్బంది, పోలీసులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో సిబ్బంది ప్రవర్తిస్తున్న తీరుపై, జరుగుతున్న పరిణామాలపై ఎమ్మెల్యే కమిషనర్ భార్గవి, డీటీడబ్ల్యూఓ మోహన్‌రావుకు స్వయంగా ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే ప్రక్షాలన చేయాలని సూచించారు. ఆయనతోపాటు టీడీపీ కన్వీనర్ తొట్లి రెడ్డిశేఖర్‌రెడ్డి, సీనియర్ నాయకులు బీగం శంకరనాయుడు, రాజారెడ్డి, ప్రవీణ్‌కుమార్, నాగభూషణ, మాజీ జడ్పీటీసీ రవీంద్రారెడ్డి, ఆనంద్‌రెడ్డి, క్రిష్ణానాయక్, రమణనాయక్, నాగభూషణ్‌నాయక్, జనార్ధన్‌నాయక్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

● ధర్మవరం ఇన్‌చార్జి పరిటాలశ్రీరామ్



నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

ధర్మవరం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆయావార్డుల్లో ప్రజలకు టీడీపీ శ్రేణులు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్ సూచించారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో 27, 29, 39 వార్డుల కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. కాలనీల్లో ఉన్న సమస్యలను అడిగితెలుసుకున్నారు. ప్రధానంగా హౌసింగ్, డ్రైనేజీ, రోడ్లు, తాగునీరు తదితర సమస్యలను పరిటాలశ్రీరామ్ దృష్టికి ప్రజలు తీసుకొచ్చారు. వార్డులవారీగా పరిస్థితి ఏమిటి అన్నది ఆయన ఆరాతీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ప్రభుత్వంలో ఇళ్లు లేని ప్రతి ఒక్కరికి ఇళ్లు అందుతాయని స్పష్టం చేశారు. తాను పాదయాత్ర చేసిన సమయంలో ఇందిరమ్మకాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ సమస్యలను గుర్తించామని అవి పరిష్కారమయ్యే విధంగా అధికారులతో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. ప్రభుత్వానికి మంచిపేరు తెచ్చేలా ప్రతి ఒక్కరు పనిచేయాలన్నారు. ఏపీ సీడ్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కమతం కాటమయ్య, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశేసుధాకర్, మున్సిపల్ మాజీ చైర్మన్ బీరే గోపాలక్రిష్ణ, నాయకులు పురుషోత్తంగౌడ్, అంబటి సనత్ పాల్గొన్నారు.


వినియోగదారుడిలో మార్పు అవసరం



మాట్లాడుతున్న వినియోగదారుల సమాఖ్య ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్

పుట్టపర్తి రూరల్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): వస్తువుల పట్ల వినియోగదారుడి మార్పు స్థిరమైన జీవనశైలికి అద్దం పడుతుందని వినియోగదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్ అన్నారు. శనివారం జగరాజుపల్లి ఆదర్శపాఠశాలలో ప్రపంచవినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వినియోగదారుడు వస్తువుల వినియోగంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వస్తువుల వినియోగంలో మార్పు మొదట వినియోగదారుడిలో రావాల్సిన అవసరాన్ని వివరించారు. ఇందులోప్రథమంగా అవసరంలేని వస్తువులను కొనుగోలు చేయడం, ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా ఇషేధించడం, పెళ్లిళ్ల, పార్టీల పేరుతో జరిగే ఆహార వృథాను అరికట్టడంతో పాటు వినియోగదారులు కొనుగోలుచేసి ఉపయోగించే ప్రతివస్తువుకు పర్యావరణానికి సంబందించిన అంశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గురునాథ్, మురళి, అధ్యాపకులు రామ్మోహన్‌రెడ్డి, ప్రతిమ, సురేఖ, అజీంసాషా, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు కలెక్టరేట్ వద్ద చేనేతల నిరసన



మాట్లాడుతున్న చేనేత కార్మికసంఘం ప్రధాన కార్యదర్శి వెంకటనారాయణ

ధర్మవరం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): చేనేతలకు రాష్ట్ర బడ్జెట్‌లో జరిగిన అన్యాయాన్ని ఖండిస్తూ సోమవారం కలెక్టరేట్, ఆర్డీఓ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఏపీ చేనేత కార్మికసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటనారాయణ తెలిపారు. శనివారం కదిరిగేటు వద్దనున్న చేనేత విగ్రహం ఎదుట ఆయన విలేకరులతో మాట్లాడారు. చేనేత కార్మికులకు బడ్జెట్‌లో రూ.2వేల కోట్లు ప్రభుత్వం కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు చేనేత వస్త్రాలపై జీఎస్టీ తొలగిస్తామని హామీ ఇచ్చి నేటికీ అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వం రూ.200కోట్లు బడ్జెట్‌లో చేనేతలకు కేటాయిస్తే ఈ ప్రభుత్వం కేవలం రూ.138 కోట్లు కేటాయించిందన్నారు. చేనేత సహకార సంఘాలకు ఏడేళ్లుగా ఎన్నికలు జరగకుండా ఆప్కో చైర్మన్ నియమిస్తూ ఆరు నెలలకొకసారి రెన్యూవల్ చేస్తున్నారని మండిపడ్డారు. చేనేత కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు పోలా లక్ష్మీనారాయణ, జిల్లా గౌరవాధ్యక్షుడు వెంకటస్వామి, చేనేతనాయకులు ఆదినారాయణ, శ్రీనివాసులు, రంగయ్య, దేవేంద్ర, శివ, వేణు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

పరిశ్రమలతో మహిళలకు చేయూత: ఎంపీ బీకే పార్థసారథి


భూమిపూజ చేసేందుకు వస్తున్న ఎంపీ పార్థసారథి

పెనుకొండ రూరల్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎన్నో నూతన పరిశ్రమలు వచ్చి మహిళలకు చేయూతనివ్వడం జరుగుతోందని హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి పేర్కొన్నారు. శనివారం రొద్దం మండల కేంద్రంలో రేణుక గార్మెంట్స్ నూతన పరిశ్రమకు భూమిపూజ నిర్వహించారు. రూ.5కోట్ల నుంచి రూ.6కోట్లతో 300మంది మహిళలకు చేయూతనందించే రేణుక గార్మెంట్స్ పరిశ్రమ ఏర్పాటు కానుందన్నారు. తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మహిళా నాయకులు సుబ్బరత్నమ్మ, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

'పార్టీలకతీతంగా శిక్షణ'


మాట్లాడుతున్న టీడీపీ మండల కన్వీనర్ సోముశేఖర్

గోరంట్ల, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పార్టీలకు అతీతంగా మహిళలకు ఉచితంగా టైలరింగ్‌పై శిక్షణ ఇవ్వనుందని టీడీపీ మండల కన్వీనర్ సోముశేఖర్ తెలిపారు. గోరంట్లలోని టీడీపీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ కుట్టు శిక్షణపై ఆసక్తిగల మహిళలు సచివాలయాల్లో పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. మొదటి విడతగా గోరంట్లలో కేటాయించిన సెంటర్లు, వానవోలులో సెంటర్‌ను త్వరలో మంత్రి సవిత ప్రారంభిస్తారని వివరించారు. ప్రతి సెంటర్ నుంచి 20 మిషన్లతో 60 మంది మహిళలకు 90 రోజులు శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణ అనంతరం కుట్టుమిషన్లను ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

నేడు పురస్కారాల ప్రదానం

పెనుకొండ, మార్చి 15(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వివిధ రంగాల్లో విశేషంగా కృషిచేసిన మహిళలకు శిరోమణి పురస్కారాలు అందజేస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు జాబిలి చాంద్‌బాషా తెలిపారు. ఆదివారం స్థానిక మార్కెట్‌యార్డ్‌లో నిర్వహించే కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితకు పౌరసన్మానం నిర్వహించనున్నామన్నారు. 25మంది మహిళలకు పురస్కారాలు అందజేస్తామన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హిందూపురం పార్లమెంట్ సభ్యులు బీకే పార్థసారథి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, శాసనమండలి సభ్యురాలు మంగమ్మ, విశిష్ట అతిథులుగా ఎస్పీ రత్న, పుట్టపర్తికి చెందిన కుమారి సువర్ణ, ఆర్డీఓ ఆనంద్‌కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు.

ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయండి
మునిసిపల్ చైర్మన్ రమేష్


విద్యార్థులకు అట్టలు పంపిణీ చేస్తున్న మునిసిపల్ చైర్మన్

హిందూపురం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): పదవ తరగతి చదివే విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని మునిసిపల్ చైర్మన్ రమేష్ సూచించారు. శనివారం ముద్దిరెడ్డిపల్లిలోని జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు కౌన్సిలర్ మహాలక్ష్మి, నాగేంద్ర సహకారంతో అట్టలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి హాజరైన చైర్మన్ మాట్లాడుతూ లక్ష్యంతో చదివి పరీక్షలు రాస్తే మంచి మార్కులు సాధిస్తారన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆదిశేషు, బాలాజీ, రవికుమార్, కొండప్ప, నాగరాజు, మధు పాల్గొన్నారు.

సేంద్రియ పొలాల పరిశీలన

పరిగి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మోద, గొరవనహళ్లి గ్రామాల్లో సేంద్రియ వ్యవసాయ పద్ధతుల్లో సాగుచేస్తున్న పంటలను శనివారం జిల్లా వ్యవసాయాధికారి వైవి సుబ్బారావు పరిశీలించారు. వీడీఎస్, ఏటీఎం మోడల్ పద్ధతుల్లో పంటలు సాగుచేసిన విజయ్‌కుమార్, నంజుండప్ప పొలాలను సందర్శించి సేంద్రియ వ్యవసాయంవల్ల కలిగే ప్రయోజనాలపై వివరించారు. మల్లంగి, టమోటా, వివిధ రకాల పంటలను వీఏటీఎం పద్ధతిలో సాగుచేస్తే అధిక దిగుబడులు సాధ్యమవుతాయన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి విజయభారతి, మోదా రైతు సేవా సంఘం సిబ్బంది పాల్గొన్నారు.

'పిల్లల భవిష్యత్తుకు బాటలు వేయండి'

గుడిబండ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పిల్లల భవిష్యత్తుకు తల్లిదండ్రులు బాటలు వేయాలని ఎంజేపీ బాలికల కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ సూచించారు. తద్వారా వారు ఉన్నతశిఖరాలు అధిరోహించేలా చూడాలన్నారు. శనివారం గుడిబండ ఎంజేపీ బాలికల కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసిన విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి డాక్టర్లు, ఇంజనీర్లు, శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. ప్రజాసేవకు అంకితం కావాలని సూచించారు. విద్యతోనే సమాజ అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రసాద్

ఆఖరి మజిలీకి తప్పని అగచాట్లు

శ్మశానవాటికలు లేక 20 గ్రామాల్లో ఇబ్బందులు
సమస్యను పరిష్కరించాలని వినతి


పాలసముద్రం చెరువు కాలువను శవంతో దాటుతున్న దృశ్యం (ఫైల్)

గోరంట్ల, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఆఖరి మజిలీకి కష్టాలు తప్పడంలేదు. శ్మశానవాటిక సమస్య వట్టిపోడి స్తోంది. మండలకేంద్రమైన గోరంట్లలో హిందూ శ్మశానవాటికలు లేకపోవడం ప్రధాన సమస్యగా తలెత్తుతోంది. గోరంట్లతోపాటు మండలంలోని 20 గ్రామాల్లో శ్మశానవాటికలు లేక ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గోరంట్లలోని ఎస్సీకాలనీ పక్కన పూర్వం నుంచి ఉన్న శ్మశానవాటిక పట్టణ విస్తీర్ణంలో ఆక్రమణలకు గురై కనుమరుగైంది. చిత్రావతి నది ఒడ్డున ఉన్న శ్మశానవాటికది ఇదే పరిస్థితి. దశాబ్దాల కాలంగా సమస్య ఉన్నప్పటికి పాలకులు అనువైన స్థలం శ్మశానవాటికకు చూపలేకపోతున్నారన్న విమర్శలు ఉన్నాయి. గత టీడీపీ అధికారంలో ఎముకలగుట్టపల్లి రహదారిలో కొంత స్థలం శ్మశానవాటికకు కేటాయించారు. అయితే వైసీపీ ప్రభుత్వం రావడంతో జగన్న కాలనీ అక్కడ ఏర్పాటు చేశారు. శ్మశానవాటిక స్థలంలోని పట్టణంలోని చెత్తాచెదారాన్ని వేసి డంపింగ్‌యార్డుగా మార్చారు. అనాలోచిత నిర్ణయంతో కాలనీవాసులు, ప్రజలు సమస్యలెదుర్కొంటున్నారు. గోరంట్ల, పాలసముద్రంతోపాటు, పుట్టగుండ్లపల్లి, కమ్మలవాండ్లపల్లి, రెడ్డిచెరువుపల్లి, కాగారెడ్డిపల్లి, మల్లాపల్లి, వానవోలు, పులేరు, బూదిలి, గడ్డంతండా, కరావులపల్లి, కరావులపల్లితండా, నారసింహపల్లి, కోరేవాండ్లపల్లి తదితర గ్రామాల్లో శ్మశానవాటికలు లేక ఆయా గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. గోరంట్ల మేజర్ పంచాయతీ

మేమంతా కానివారిమయ్యామా?



పట్టణ జనాభా పెరుగుతోంది. తరాలు మారుతున్నా గోరంట్లలో హిందూ శ్మశానవాటిక సమస్య పరిష్కారం కాలేదు. మేమంతా కానివారిమయ్యామా. పాలకులు ఎందుకు పట్టించుకోలేదు. ఇప్పటికైనా శ్మశానవాటికకు పాలకులు స్థలాన్ని చూపాలి.
- మధుసూదన్‌రెడ్డి, కసిరెడ్డిపల్లి, గోరంట్ల

ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలి



శ్మశానవాటిక స్థలాన్ని డంపింగ్‌యార్డుగా మార్చేశారు. దీంతో సమస్య మొదటికొచ్చింది. పట్టణానికి సమీపంలో శ్మశానవాటికకు మాత్రమే అనువైన స్థలాన్ని కేటాయించాలి. అక్కడే బోరు వేసి నీటి సౌకర్యం, ప్రహరీగోడ నిర్మించి, హిందూ శ్మశానవాటిక ఏర్పాటు చేయాలి.
- డాక్టర్ రవితేజ, గోరంట్ల

శాశ్వతంగా సమస్యను పరిష్కరిస్తాం



గోరంట్లలో హిందూ శ్మశానవాటిక సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తాం. మంత్రి సవితతో చర్చించి, అధికారుల ద్వారా ప్రభుత్వ భూసేకరణకు కృషి చేస్తాం. పట్టణానికి సమీపంలో ప్రభుత్వ స్థలంలో ఒకేచోట ఐదు ఎకరాలను కేటాయించేలా ప్రయత్నిస్తాం.
- సరోజ, సర్పంచ్, గోరంట్ల మేజర్ పంచాయతీ

మండల వ్యాప్తంగా సమస్య



మండల వ్యాప్తంగా 20గ్రామాల్లో ఈ సమస్య ఉంది. గోరంట్లలోని కదిరి రోడ్డులో కళాశాల వద్ద 3.15 ఎకరాలు, సింగిరెడ్డిపల్లి రహదారిలో 2.15 ఎకరాలు శ్మశానవాటికకోసం పరిశీలించాం. పాలసముద్రంలో జాతీయ రహదారి పక్కన చామలపల్లి వద్ద ఎకరా స్థలం చూశాం. అయితే గ్రామస్థులు హైవే దాటి వెళ్లాల్సి ఉండడంతో అభ్యంతరం తెలుపుతున్నారు. వానవోలు పొలంలో కమ్మవారి పల్లి ప్రజలకోసం సర్వేనంబర్ 133లో2.25 ఎకరాలు చూశాం. ఒక్కొక్కటిగా సమస్యను పరిష్కరిస్తున్నాం. ఇంకా బూదిలి, గడ్డంతండా, కరావులపల్లి, కరావులపల్లితండా, కమ్మలవాండ్లపల్లిలో శ్మశానవాటిక సమస్య పరిష్కరించాల్సి ఉంది.
- మారుతి, తహసీల్దార్, గోరంట్ల

అభివృద్ధి.. సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్లు

- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత
- పెద్దగువ్వలపల్లిలో రూ.75లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ


శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి సవిత

పెనుకొండ రూరల్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్లని, సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత అన్నారు. శనివారం రొద్దం మండలంలోని పెద్దగువ్వలపల్లి నుంచి కల్లుకుంట క్రాస్‌వరకు రూ.75లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రొద్దం మండల వ్యాప్తంగా 73 పనులు రూ.5.75కోట్లతో పూర్తిచేయడం జరిగిందన్నారు. త్వరలో నల్లూరు నుంచి దందేపల్లి వరకు రూ.1.20కోట్లతో బీటీ రోడ్డునిర్మాణం చేపడతామన్నారు. దొడగట్ట నుంచి డీఆర్‌కొట్టాల గ్రామం వరకు రూ.1.30కోట్లతో బీటీ రోడ్డు వేయనున్నట్లు తెలిపారు. నల్లూరు నుంచి కల్లుకుంట బ్రిడ్జి వరకు రూ.2.80కోట్లతో రోడ్డు వేయనున్నట్లు వెల్లడించారు. రొద్దం మండలవ్యాప్తంగా 44గోకుల షెడ్లు నిర్మించామని త్వరలో మరిన్ని నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో మాధవనాయుడు, చంద్రమౌళి, నరహరి తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ

అనారోగ్యంతో బాధపడుతున్న టీడీపీ కార్యకర్తలను మంత్రి సవిత పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. శనివారం రొద్దం మండలంలో పర్యటించిన ఆమె చిన్నమంతూరు గ్రామానికి చెందిన వెంకటేష్ కుమారుడు సాయిగణేష్‌ను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. కంచుకూర్లపల్లి గ్రామానికి చెందిన ఐదిగి ఆంజినేయులు పక్షవాతంతో బాధపడుతుండగా ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని ఆర్థిక సాయం అందజేశారు.

ప్రజాసేవే ప్రథమ కర్తవ్యంగా వైద్యులు పనిచేయాలి

కలెక్టర్ టీఎస్ చేతన్


సమావేశంలో వైద్యులు, సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

హిందూపురం అర్బన్, మార్చి 15, (ఆంధ్రజ్యోతి): ప్రజాసేవే ప్రథమ కర్తవ్యంగా వైద్యులు పనిచేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ సూచించారు. హిందూపురం ఆసుపత్రిలో వైద్యుల తీరు సరిగా లేదని వెంటనే మార్చుకోవాలని ఆదేశించారు. వేల సంఖ్యలో రోగులు వైద్యసేవలకోసం ఆసుపత్రికి వస్తుంటారని, వారికి సకాలంలో మంచి వైద్యం అందించాలన్నారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ స్థానంలో ఆయన శనివారం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో సమావేశం ఏర్పాటు చేశారు. తెలుగు అందుతున్న వైద్యసేవలు, సిబ్బంది తీరుపై మాట్లాడారు. వైద్యసేవలు సరిగా అందలేదంటూ ప్రజల నుంచి ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయన్నారు. మరోమారు ఇలాంటి ఫిర్యాదు రాకూడదని, వైద్యులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పనిచేయడం ఇష్టం లేకపోతే మానేయాలన్నారు. సదరం క్యాంపుల్లో ఎక్కువ అవకతవకలు జరుగుతున్నాయని, అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వాహనాలు విచ్చల విడిగా పార్కింగ్ చేయడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం అన్న క్యాంటీన్‌ను సందర్శించి భోజనం ఎలా ఉంది.? తదితర విషయాలపై ఆరా తీశారు. ఎస్పీ శ్రీ వైద్యసేవలను స్పెషలిస్టు వైద్యులతో అందించాలన్నారు. మాతా శిశు మరణాలు తగ్గే విధంగా కృషిచేయాలన్నారు. వైద్యులు, సిబ్బంది సమయపాలనను పాటించాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకోవాలని డీసీహెచ్ తిప్పేంద్రనాయక్‌ను ఆదేశించారు. కలెక్టర్ వెంట డీసీహెచ్ తిప్పేంద్రనాయక్, సూపరింటెండెంట్ లింగన్న, మునిసిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు, కమిటీ సభ్యులు ప్రభుకుమార్, బండారు బాలాజీ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

వైద్యురాలిపై చర్యలు తీసుకోండి: బాధితుడి వినతి

వైద్యసేవలు అందించే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించి తన భార్య ప్రాణాలు పోవటానికి కారణమైన వైద్యురాలిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు కలెక్టర్‌కు వినతి అందించారు. శనివారం హిందూపురంలోని హెచ్‌డీఎస్ కమిటీ సమావేశానికి వచ్చిన కలెక్టర్‌ను వాల్మీకి వీధికి చెందిన హరి కలిసి ఈ మేరకు వినతి అందించారు. తన భార్య నిజేరియన్ చేయించుకుందని, కుట్లు సరిగా వేయకపోవడంతో అధికరక్తస్రావమైందన్నారు. ఈ విషయాన్ని నర్సులు పలుమార్లు వైద్యురాలికి ఫోన్‌లో తెలిపినా ఆమె అర్ధరాత్రి దాకా రాలేదని కలెక్టర్‌కు తెలిపారు. దీంతో తన భార్య మృతిచెందిందని, వెంటనే ఆ వైద్యురాలిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

స్టేడియం పనులు వేగవంతం చేయండి

హిందూపురం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఎంజీఎం క్రీడామైదానంలో అర్ధంతరంగా ఆగిన ఇండోర్ స్టేడియం పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ చేతన్ ఆదేశించారు. శనివారం ఇండోర్ స్టేడియంను ఆయన పరిశీలించారు. స్టేడియం పూర్తి చేయడానికి రూ.2కోట్లు మంజూరయ్యాయని, వెంటనే పనులు ప్రారంభించి పూర్తిచేయాలన్నారు. ఎంజీఎం క్రీడా మైదానంలో ఈ సందర్భంగా మొక్కలు నాటారు. మునిసిపల్ చైర్మన్ రమేష్ మాట్లాడుతూ గుడ్డం కోనేరు అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, కౌన్సిలర్లు నవీన్, అంజలి, మంజుళ, నాగేంద్రమ్మ, సతీష్, ఆయాజ్, కురుబ కార్పొరేషన్ నాయకులు పరిమళ పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని ఆరోగ్యాలను కాపాడుకుందామని పలువురు అధికారులు, నాయకులు పిలుపునిచ్చారు. ప్రతినెలా మూడవ శనివారాన్ని స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రప్రదేశ్‌గా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా శనివారం పలు కార్యాలయాల్లో అధికారులు చీపురు పట్టి పరిసరాలను శుభ్రం చేశారు.

ప్లాస్టిక్‌రహిత సమాజాన్ని నిర్మిద్దాం

గోరంట్ల, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని ఎంపీడీఓ నరేంద్రకుమార్ సూచించారు. ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. శనివారం గోరంట్ల ప్రధాన రహదారిపై అధికారులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించి కూడలిలో మానవహారంగా ఏర్పాటయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లు వాడే దుకాణదారులకు నోటీసులు ఇస్తామన్నారు. వీధుల్లో చెత్తాచెదారం వేయకుండా ప్రతిఒక్కరూ బాధ్యతగా ఉండాలన్నారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్రకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ గోపాల్, పంచాయతీ అధికారి సాయిసంజీవ్, నాయకులు నిమ్మల శ్రీధర్, బాలకృష్ణ, సంతోష్, బోయ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.


మాట్లాడుతూ ఎంపీడీఓ నరేంద్రకుమార్

గుడిబండ, (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం సాధ్యం అని డిప్యూటీ తహసీల్దార్ కల్యాణచక్రవర్తి, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ రామ్‌బాపారెడ్డి పేర్కొన్నారు. శనివారం ప్రభుత్వం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్రలో భాగంగా ఆయన మాట్లాడారు.

చిలమత్తూరు, (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛతతోనే ఆరోగ్యం అని మండల వైద్యాధికారులు రామకృష్ణ, తేజస్విని పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

పెనుకొండ, (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించడంతోనే స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సాధ్యమని ఎన్‌సీసీ కమాండరింగ్ అధికారి ఆకోశ్‌త్రిపాటి పేర్కొన్నారు. పట్టణ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీ ఆధ్వర్యంలో చేపట్టిన స్వచ్ఛాంధ్రప్రదేశ్ కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కేశవరావు, వైస్ ప్రిన్సిపాల్ జయప్ప పాల్గొన్నారు.

పది పరీక్షలకు సర్వం సిద్ధం
డీవైఈఓ పద్మప్రియ



పెనుకొండ, మార్చి 15(ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తిచేయడం జరిగిందని డీవైఈఓ పద్మప్రియ తెలిపారు. పెనుకొండ ఎడ్యుకేషన్ డివిజన్‌లోని పెనుకొండ, హిందూపురం, మడకశిర డివిజన్లకు సంబంధించి 55 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. డివిజన్‌లో మొత్తం 12,547మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారన్నారు. అందు లో రెగ్యులర్ విద్యార్థులు 11,860మంది కాగా ప్రైవేట్ విద్యార్థులు 687మంది ఉన్నారన్నారు. విద్యార్థులు పరీక్షలు రాస్తు న్న ప్రతి గదిలోనూ విద్యుత్ దీపాలు, ఫ్యాన్లు, మంచినీటి ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. పరీక్షా కేంద్రాలవద్ద 144సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పరీక్ష సమయంలో జిరాక్స్ సెంటర్లను మూసి వేయించడం జరుగుతుందన్నారు. పెనుకొండలో 4 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు.

కేబుల్ వైరు చోరీ

చిలమత్తూరు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మోటార్లకు ఏర్పాటుచేసుకున్న కేబుల్ వైర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం చోరీ చేశారు. 30 మీటర్ల కేబుల్ వైర్లను చోరీ చేసినట్లు కోడూరు రైతులు బాబురెడ్డి, ఈశ్వరరెడ్డి, రాజేంద్రరెడ్డి తెలిపారు. ఇలాంటి ఘటనలు తరుచూ జరుగుతున్నాయని, పోలీసులు స్పందించి ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, మార్చి15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 3 వార్డులో నివాసముంటున్న వివాహిత స్వప్న విషద్రావకం తాగి శనివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ తగాదాల నేపథ్యంలో మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ ఉషా చికిత్స అందజేసి మెరుగైన వైద్యం కోసం హిందూపురం వెళ్లాలని సూచించారు.

'వీధి దీపాలను ఏర్పాటుచేయండి'

చిలమత్తూరు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): గ్రామంలో నాలుగు నెలలుగా వీధి దీపాలు లేక చీకటిలో మగ్గుతున్నామని, వెంటనే ఏర్పాటుచేయాలని తుమ్మలకుంట గ్రామస్థులు శనివారం చిలమత్తూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి సావిత్రికి వినతిపత్రం అందించారు. ఇటీవల దొంగతనాలు కూడా ఎక్కువగా జరుగుతున్నాయని, దీనిని దృష్టిలో పెట్టుకొని వీధి దీపాలు ఏర్పాటుచేయాలని కోరారు. వెంటనే ఏర్పాటుచేస్తామని పంచాయతీ కార్యదర్శి గ్రామస్థులకు హామీ ఇచ్చారు.

విజయవంతం చేయండి

సోమందేపల్లి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఈనెల 18న విజయవాడలో జరిగే ధర్నాను కళాకారుల మహాధర్నాను విజయవంతం చేయాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు హనుమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంపీ రమణ, సహాయ కార్యదర్శి వెంకటేశులు కోరారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ అర్హులైన వారికి పింఛన్ ఇవ్వాలన్నారు. పెన్షన్లను రూ.7వేలు పెంచి డప్పు, డ్రమ్స్, గజ్జలను అందజేయాలన్నారు.

'సేవలు మరింత విస్తృతం'

హిందూపురం అర్బన్, మార్చి 15, (ఆంధ్రజ్యోతి): పోస్టల్ సేవలను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆంధ్రప్రదేశ్ అసిస్టెంట్ డైరెక్టర్ శివనాగరాజు సూచించారు. శనివారం తపాల డివిజన్ స్థాయి వార్షికోత్సవం ఏర్పాటు చేసిన సమీక్షకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో హిందూపురం డివిజన్ మంచి ప్రగతి సాధించిందన్నారు. కార్యక్రమంలో హిం దూపురం పోస్టల్ సూపరింటెండెంట్ విజయభాస్కర్, పోస్ట్ మాస్టర్ మార్కండేయులు, ఏఎస్‌పీ మల్లికార్జున, కళ్యాణ్‌రామ్, విమల్, రాజేష్, జిలాన్ పాల్గొన్నారు.

కారులో మంటలు


మంటలు ఆర్పుతున్న స్థానికులు

హిందూపురం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సద్భావన సర్కిల్ సమీపంలో శనివారం మధ్యాహ్నం ఒక్కసారిగా కారులో మంటలు వచ్చాయి. కొంతమంది బకెట్లతో నీళ్లు తీసుకొచ్చి మంటలు ఆర్పారు. వైర్లు షార్ట్ కావడంతోనా లేక ఎండవేడిమికి కారులో మంటలు వచ్చాయా అని అక్కడి వారు చర్చించుకున్నారు.